సాక్షి

పార్వతీపురం మన్యం

బుధవారం । 28 । జూన్ । 2023



సంక్షేమ వారధి డీఆర్‌డీఏ

ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సమర్థంగా లబ్ధిదారులు చేరవేయడంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అధికారులు సఫలమవుతున్నారు.

- IIలో



విత్తనాల పంపిణీ

డెంకాడ: ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వరి విత్తనాల పంపిణీని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు డెంకాడ మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ప్రారంభించారు.

29న బక్రీద్

విజయనగరం టౌన్: ముస్లింల పవిత్ర పర్వదినం బక్రీద్‌ను ఈ నెల 29న నిర్వహిస్తామని మాజీ వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ కరీమ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశప్రజలందరికీ ఆరోగ్యం, సిరిసంపదలు సమకూరి, దేశాభివృద్ధి జరగాలంటూ అన్ని మసీదులు, ఈద్‌గాహ్‌లలో నమాజ్ చేయాలని కోరారు. నిరుపేదలకు అన్న, వస్త్ర, విద్యాదానం చేయాలన్నారు.

నేడు కురుపాంలో
సీఎం పర్యటన

- 'జగనన్న అమ్మఒడి' నాలుగో ఏడాది నిధుల విడుదల
- సీఎం సభాస్థలి, హెలిప్యాడ్‌ను పరిశీలించిన మంత్రి బొత్స సత్యనారాయణ
- ఏర్పాట్లపై ఎస్పీ, కలెక్టర్‌తో చర్చించిన మంత్రి

కురుపాం: 'జగనన్న అమ్మఒడి' నాలుగో ఏడాది నిధులను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం కురుపాం మండల కేంద్రానికి రానున్నారు. ఈ మేరకు సీఎం సభాస్థలి, హెలిప్యాడ్‌ను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. సభకు పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం, పార్వతీపురం, పాలకొండ, సాలూరు నియోజకవర్గాలతో పాటు విజయనగరం జిల్లాలోని పలు నియోజకవర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉండడంతో ఏర్పాట్లను మంత్రి నిశితంగా పరిశీలించారు. కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, ముఖ్య మంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాంతో చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పాముల పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బహిరంగ సభ ఏర్పాట్లపై ఎస్పీ విక్రాంత్‌పాటిల్, తలశిల రఘురాంతో చర్చిస్తున్న మంత్రి బొత్స సత్యన్నారాయణ

సిద్ధమైన సభావేదిక

కురుపాం సమీపంలో చినమేరంగి గ్రామానికి వెళ్లే రహదారి పక్కన ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదిక అందంగా ముస్తాబైంది. నాలుగు నియోజకవర్గాల నుంచి వచ్చే ప్రజలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూర్చొనేందుకు వీలుగా అధికారులు సర్వం సిద్ధం చేశారు. ద్విచక్రవాహనాలు, పెద్ద వాహనాల పార్కింగ్‌కు స్థలాలను కేటాయించారు.



బహిరంగ సభకు వచ్చే ప్రజలు కూర్చునేందుకు సిద్ధం చేసిన కుర్చీలు

జగనన్నకు ఘనస్వాగతం పలుకుదాం



- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: పార్వతీపురం మన్యం జిల్లాకు బుధవారం వస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఘనస్వాగతం పలుకుదామని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. సాలూరులోని ఆయన స్వగృహంలో విలేకర్లతో మంగళవారం మాట్లాడారు. కొత్త జిల్లా ఏర్పడిన తరువాత తొలిసారిగా వస్తున్న ముఖ్యమంత్రిని సాదరంగా ఆహ్వానిద్దామన్నారు. నాలుగో ఏడాది అమ్మఒడి నిధులు విడుదల చేసేందుకు కురుపాంకు వస్తున్న ముఖ్యమంత్రికి దళిత, గిరిజన, యువజన, మహిళా సంఘాల నాయకులు, ప్రజలు తమసమస్యలు పరిష్కరించాలంటూ వినతులు ఇచ్చేందుకు పోటీపడకుండా, అక్కడికి వచ్చే మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులకు అందజేయాలన్నారు. వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఓ సోదరుడిగా, ఓ పెద్దకొడుకులా ముఖ్యమంత్రి అందరి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. గతంలో జీసీసీ మేనేజర్‌గా కురుపాంలో పనిచేశానని, అక్కడి ప్రజలతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

సజావుగా సీఆర్టీల బదిలీల కౌన్సెలింగ్



సీఆర్టీలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీ (కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్)ల బదిలీల కౌన్సెలింగ్ ఐటీడీఏలో పీఓ కల్పనాకుమారి సమక్షంలో మంగళవారం సజావుగా జరిగింది. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లా పరిధిలో మొత్తం 120 మందికి బదిలీలు చేశారు. వీరిలో స్కూల్ అసిస్టెంట్లు గణితం–28 మంది, పీఎస్–16, బీఎస్–24, సోషల్–14, ఎస్ఏ తెలుగు–7, హిందీ–6, ఇంగ్లిష్–18, పీడీలు ఏడుగురు ఉన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి, ఏటీడబ్ల్యూఓ కృష్ణవేణి, ఏఎంఓ కోటిబాబు, హెచ్ఎంలు కె.సుబ్బారావు, చంద్రరావు, నారాయుడు, సూర్యం, ఉమావాణి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో మృతదేహం

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి పెట్రోల్ బంకు వద్ద మంగళవారం వేకువ జామున గుర్తు తెలియని వాహనం ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై సురేంద్రనాయుడు తెలిపారు.వాహనం బలంగా ఢీ కొట్టడంతో మృతుడి తల నుజ్జునుజ్జయి పోల్చుకోలేని విధంగా ఉందని చెప్పారు. మృతునికి 50 ఏళ్లు ఉంటాయని, నల్లని షర్ట్, తెల్లని షార్ట్ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించి, కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి..



మృతిచెందిన రామకృష్ణ

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన యువకుడు విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి ఎస్.కోట ఎస్సై తారకేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం గ్రామానికి చెందిన అల్లు రామకృష్ణ (32) శనివారం రాత్రి తన కళ్లం వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన బంధువులు ఆదివారం ఎస్.కోట సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌లో చేర్చారు. మృతుడి తండ్రి జనవరి నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.

బ్యాంకు అకౌంట్‌లో రూ. 50వేలు మాయం

రాజాం సిటీ: పోయిన ఫోన్ నంబర్ స్థానంలో కొత్త నంబర్‌ను బ్యాంకు అకౌంట్‌కు యాడ్ చేయకపోవడంతో ఓ వ్యక్తి తన అకౌంట్ నుంచి రూ. 50వేలు పోగొట్టుకున్నాడు. ఆలస్యంగా విషయం తెలుసుకుని పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనపై సీఐ కె.రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన గండివల్లి పుష్పనాథం పొగిరి లెప్రసీ ఆస్పత్రిలో పనిచేసి 15ఏళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందాడు. అప్పటి నుంచి తన పింఛన్ మొత్తం యూనియన్ బ్యాంకు అకౌంట్‌కు జమ అవుతోంది. ప్రతి నెలా ఆ డబ్బు చెక్‌బుక్ ద్వారా విత్‌డ్రా చేసుకునేవాడు. ఈ నెలలో తన పింఛన్ డబ్బులు అకౌంట్‌లో జమ అయిందీ లేనిది చెక్ చేసుకునేందుకు బ్యాంకుకు వెళ్లాడు. బ్యాంకు సిబ్బంది అకౌంట్‌లో రూ.7,455లు మాత్రమే ఉన్నాయని చెప్పడంతో అకౌంట్‌లో రూ.58వేలు ఉండాలని, మరోసారి చెక్‌చేయాలని అభ్యర్థించాడు. వెంటనే మరోసారి అకౌంట్‌ను చెక్‌చేసిన బ్యాంకు అధికారులు సంబంధిత అకౌంట్‌కు లింక్ అయిన ఫోన్ (8520879739) నంబర్ నుంచి యూపీఐ ద్వారా రూ. 30వేలు, రూ. 20వేలు చొప్పున రెండుసార్లు లావాదేవీలు జరిగాయని వెల్లడించారు. దీంతో కంగుతిన్న బాధితుడు ఇది గతంలో తాను వాడిన నంబర్ అని, ప్రస్తుతం ఉపయోగించని కారణంగానే సంబంధిత మెసేజ్‌లు రావడంలేదని లబోదిబోమన్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు తన అకౌంట్ నుంచి పాత మొబైల్ నంబర్‌ను ఉపయోగించి యూపీఐ చెల్లింపులు చేసి నగదు కాజేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవికుమార్ తెలిపారు.

నాలుగు పశువులశాలలు దగ్ధం

బాడంగి: మండలంలోని పి.వెంకయ్యపేట గ్రామంలో అగ్నిప్రమాదం జరిగి నాలుగు పశువులశాలలు మంగళవారం కాలిపోయాయని గ్రామసర్పంచ్ వాసిరెడ్డి శంకరరావు చెప్పారు. విద్యుత్‌వైర్లు పశువుల శాలలపైనుంచి వేలాడుతుండగా షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన అన్నదమ్ములు అల్లు అప్పల నాయుడు, ఆదినారాయణ, సత్యనారాయణల శాలలతో పాటు ప్రతాపరావు శాల కాలిపోయినట్లు తెలిపారు. సత్యనారాయణ శాలలో ఇంటికి అవసరమైన బండి టేకుకర్రలు కాలిపోయినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో ఆస్తినష్టం సుమారు రూ.50వేలకు పైగా ఉంటుందన్నారు. అయితే అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎలాంటి పశుప్రాణనష్టం జరగలేదు.

గోపెంపేటలో మరో రెండు..

రేగిడి: మండల పరిధిలోని గోపెంపేట గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పశువులశాలలు దగ్ధమయ్యాయి. లావేటి రాము, ఎర్నేన సూర్యనారాయణలకు చెందిన పశువుల శాలలు పూర్తిగా కాలిపోయాయి. పొలం పనుల్లో రైతులంతా ఉన్న సమయంలో ఈ ప్రమాదం సంభవించిందని బాధిత రైతులు చెబుతున్నారు. దేవునిగుడిలోని దీపవు ఒత్తిని కాకులు తీసుకువచ్చి పశువులశాలలపై వేయడంతోనే ప్రమాదం జరిగిందని వాపోతున్నారు. ఈ ప్రమాదంలో టేకు కలప, ఇంటి తలుపులు, సైకిల్, వ్యవసాయ సామగ్రి ధ్వంసమయ్యాయి. పాలకొండ అగ్నిమాపక సిబ్బంది సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వచ్చి మంటలు అదుపుచేయడంతో పెనుప్రమాదం తప్పింది.

సంక్షేమ వారధి డీఆర్‌డీఏ

- పథకాలు ప్రజలకు చేర్చడంలో సఫలం
- ప్రతి నెలా ఫించన్ల రూపంలో రూ. 75.కోట్లు
- ఏటా వైఎస్ఆర్ చేయూత రూ.265 కోట్లు
- షాదీతోఫా, కల్యాణమస్తుతో రూ.4.36 కోట్లు అందజేత
- వైఎస్ఆర్ బీమా ద్వారా రూ.9 కోట్లు
- జగనన్న తోడు రూ.17 కోట్లు విడుదల



వైఎస్ఆర్ ఆసరా చెక్కును అందిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు(ఫైల్)



ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కార్యక్రమాల్లో సంతకవిటిలో స్వచ్ఛందంగా పాల్గొన్న మహిళలు



వైఎస్సార్ కల్యాణమస్తు వెరిఫికేషన్ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ

రాజాం: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సమర్థంగా లబ్ధిదారులు చేరవేయడంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అధికారులు సఫలమవుతున్నారు. వైఎస్సార్ క్రాంతి అను బంధంతో మహిళల ఆర్థికాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలుచేస్తున్న పథకాలకు వారధిగా డీఆర్‌డీఏ నిలుస్తోంది. పథకం అమలుకు ముందే నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పలు ప్రాంతాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నారు. పథకాలను అర్హులకు సకాలంలో అందజేయడంతో పాటు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. గడిచిన నాలుగేళ్లగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయడంలో డీఆర్‌డీఏ అధికారులు అనుకున్న లక్ష్యాలు ఛేదించారు. ఎక్కడా జాప్యం, అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలను నేరుగా డీబీటీ విధానంలో లబ్ధిదారులకు చేర్చారు. ఫించన్ అందించడంలో జిల్లా ప్రథమం..

వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీలో జిల్లాలోని అన్ని మండలాలు ముందంజలో ఉంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2,77,219 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారందరికీ ప్రతి నెలా రూ.75.46 కోట్లను 1వ తేదీ నుంచి 5వ తేదీలోపు అందజేస్తున్నారు. వైఎస్సార్ చేయూత పథకానికి 1,41,347 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారందరికీ ప్రభుత్వం కేటాయించిన రూ.265.03 కోట్లను ఈఏడాది మూడో విడతలో సకాలంలో అందించారు. జిల్లా వ్యాప్తంగా కల్యాణమస్తు/షాదీ తోఫాకు 764 దరఖాస్తులు అందగా, అన్నింటికీ అనుమతులిచ్చి రూ.4.36 కోట్లు చెల్లించారు. 40,321 స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 4,55,512 మందికి స్త్రీ నిధి పథకం కింద రూ.199.43 కోట్లు ప్రభుత్వం ఇప్పటివరకూ మంజూరు చేయగా, సక్రమంగా నిధులు అందజేశారు.

పక్కాగా బీమా..

వైఎస్సార్ బీమా కోసం జిల్లాలో 4,95,697 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారిలో 1288 మంది మృతిచెందగా, నామినీలకు ఎటువంటి ప్రలోభాలు, అడ్డంకులు లేకుండా రూ. 9.75 కోట్లు అందించారు. ఇందులో సహజమరణాలకు సంబంధించి రే. 5.15 కోట్లు, ప్రమాద మరణాలుకు సంబంధించి రూ. 4.60 కోట్లు చెల్లింపులు జరిగాయి. జగనన్న తోడు పథకానికి 17,885 మంది అర్హులుండగా వారి కోసం రూ.17.88 కోట్లు కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 31,058 మంది సభ్యులకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.213.32 కోట్లు అందజేశారు. అలాగే ఉన్నతి పథకం కింద 2,534 స్వయం సహాయక సంఘాలు లబ్ధి పొందాయి. ఆయా గ్రూపులకు రూ.11.75 కోట్ల లబ్ధి చేకూరింది.

సకాలంలో సంక్షేమం అందజేత



సంక్షేమ పథకాల సొమ్మును సకాలంలో లబ్ధిదారులకు అందజేస్తున్నాం. ఈ నాలుగేళ్లలో పథకాల లక్ష్యాన్ని వందశాతం మేర పూర్తిచేశాం. చాలా సంతృప్తిగా సేవలు అందిస్తున్నాం. ఎక్కడా జాప్యం జరగకుండా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం.

– ఎ.కల్యాణ చక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ, విజయనగరం

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి తీపి పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు.

రైల్వే భద్రతా నియమాలపట్ల అవగాహన కల్పించాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ వెంకట్రావు

పార్వతీపురం: రైల్వే భద్రతా నియమాలపట్ల ప్రయాణికులకు అవగాహన కల్పించాలని విశాఖపట్నం లైన్స్ (జీఆర్‌పీ)సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు సిబ్బందికి సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం రైల్వేస్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విధులను సక్రమంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. రైల్లో అక్రమంగా జరుగుతున్న మాదక ద్రవ్యాల రవాణాను నిరోధించాలని కోరారు. ఒడిశా సరిహద్దు ప్రాంతం కావడంతో లోకల్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ విధులను నిర్వహించాలని చెప్పారు. రైలులో ప్రయాణిస్తున్న వారికి ఫుట్‌బోర్డు ప్రయాణం ప్రమాదకరమని, దీనిపై అవగాహన కల్పించాలన్నారు. ఈ పరిశీలనలో రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



తైక్వాండోలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అనిల్ శర్మ

పార్వతీపురంటౌన్: ఉమ్మడి విజయనగరం జిల్లా స్థాయిలో సోమవారం నిర్వహించిన తైక్వాండో పోటీల్లో పార్వతీపురం పట్టణానికి చెందిన విద్యార్థులు జూనియర్ విభాగంలో ప్రతిభ కనబరిచారు. అనిల్ శర్మ తైక్వాండో అకాడమీలోని విద్యార్థులు ఆరు గోల్డ్ మెడల్స్, మూడు సిల్వర్ మెడల్స్, రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. అలాగే కేడెట్‌లో రెండు గోల్డ్‌మెడల్స్, సిల్వర్ మెడల్స్ రెండు, బ్రాంజ్ మెడల్స్ రెండు సాధించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు జూలై 1, 2వ తేదీల్లో చిత్తూరు జిల్లాలోని, తిరుపతిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు.

మీ వద్దకే పీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి రామారావు

పార్వతీపురం: ఎంప్లాయిస్ ప్రావిడెంట్‌ఫండ్(ఈపీఎఫ్) ఉద్యోగులకు ఇంటి వద్దకే వచ్చేలా చర్యలు చేపడతామని నోడల్ అధికారి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వై. రామారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో మీ వద్దకే పీఎఫ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈపీఎఫ్‌కు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో పీఎఫ్ సభ్యులు, పింఛనర్లు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాలపై అసంతృప్తి

- కేజీబీవీని సందర్శించిన ఎస్ఎస్ఏ స్టేట్ డెరెక్టర్



కేజీబీవీ ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు

పూసపాటిరేగ: 2022–23వ సంవత్సరంలో నిర్వహించిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో స్థానిక కేజీబీవీలో ఉత్తీర్ణత శాతం తగ్గడంతో ఎస్ఎస్ఏ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతుల వారిగా విద్యార్థులకు పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు వేశారు. విద్యార్థులు చదువు, ఆరోగ్యం, పాఠశాలలో అందుతున్న మౌలిక సదుపాయాల గురించి అడిగారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పదవతరగతిలో ఎక్కువ మంది విద్యార్థులు పరీక్ష తప్పడానికి కారణం ఏమిటని ప్రిన్సిపాల్ ఎ.భారతిని ప్రశ్నించారు. చదువు, భోజనం విషయంలో విద్యార్థులకు అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. విద్యార్థులకు వెలుతురు సరిగా లేని గదులలో చదువు చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. నాడునేడు పనులు సకాలంలో పనులు పూర్తి చేసి నూతన తరగతి గదులను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి లింగేశ్వరరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి పాపునాయుడు, జీసీడీఓ పి.మాలతి తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాల కోసం ప్రణాళికలు

డెంకాడ: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు డెంకాడ మండలంలోని అక్కివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి నాడు–నేడు పనులను పరిశీలించారు.

విజయనగరం ,శ్రీకాకుళానికి ఈట్‌రైట్ స్టేషన్‌గా గుర్తింపు

విజయనగరం టౌన్: విజయనగరం,శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌లకు ఈట్‌రైట్ స్టేషన్‌గా గుర్తింపు లభించింది. మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ సంస్థ ప్రతినిధులు గతంలో ఆ రైల్వేస్టేషన్‌లను సందర్శించి హైజెనిక్ ఫుడ్, వాడుతున్న పరికరాలు, పాగగొట్టాలు, ఫ్యాన్స్, స్టాండర్డ్స్‌ను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఈ నేపథ్యంలో నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండడంతో ఈ రెండు స్టేషన్‌లకు ఈట్ రైట్ స్టేషన్‌గా గుర్తింపు నిచ్చారని రైల్వే అధికారులు స్పష్టం చేశారు. గడిచిన మూడు నెలల క్రితం విశాఖ రైల్వేస్టేషన్‌కు ఈ గుర్తింపు లభించింది. విజయనగరం ,శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌లకు గుర్తింపు రావడంతో రైల్వే అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

భర్తను హత్య చేసిన భార్యకు యావజ్జీవం

- తీర్పునిచ్చిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణ్ చక్రవర్తి



ముద్దాయి విజయలక్ష్మి

విజయనగరం లీగల్: భర్తను హతమార్చిన కేసులో కొత్తవలస మండలం తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన ముద్దాయి అడ్డూరి విజయలక్ష్మికి జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కల్యాణ చక్రవర్తి మంగళవారం తీర్పు చెప్పారు. అనాథలైన ఇద్దరు పిల్లలకు చెరో రూ.మూడు లక్షల పరిహారం ప్రభుత్వం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేలూరి రఘురాం అందించిన వివరాలిలా ఉన్నాయి, ముద్దాయి భర్త దేముడు కొత్తవలస గ్యాస్ కంపెనీలో పనిచేసేవాడు. సుమా రు 14 ఏళ్ల క్రితం విజయలక్ష్మితో పెళ్లయింది. అనంతరం వారికి ఒక అమ్మాయి, అబ్బాయి పుట్టారు. ఇదిలా ఉండగా భార్య విజయలక్ష్మి పరాయి వ్యక్తులతో వివాహేతర సంబంధం పెట్టుకుందని భర్త తరచూ తగాదా పడుతుండేవాడు. దీంతో పాటు చెప్పా పెట్టకుండా ఇంట్లో నుంచి విజయలక్ష్మి ఉదయం వెళ్లడం, సాయంత్రం ఇంటికి రావడం చేస్తుండేది. ఈ విషయమై భార్యను పలుమార్లు నిలదీశాడు. ఈ నేథ్యంలో భర్త అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్న విజయలక్ష్మి 2019 సెప్టెంబర్ 2న రాత్రి భర్త పొట్టపై కత్తితో దాడి చేసింది.ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన దేముడు చికిత్స పొందుతూ మరునాడు మృతిచెందాడు. మృతుడి సమీప బంధువు మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు కొత్తవలస ఎస్సై బి. మురళి కేసున మోదు చేసి నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ జి.గోవిందరావు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ 18 మంది సాక్షులను కోర్టులో విచారణ చేసి అభియోగం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

ఓబీసీలోకి సొండి కులస్తులు!

- ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిని కలిసిన ఉత్తరాంధ్ర బృందం
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం
- సంఘ అధ్యక్షుడు కోటేశ్వరచౌదరి



రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జస్టిస్ వి.శంకరనారాయణను సత్కరిస్తున్న సొండి సామాజికవర్గ పెద్దలు

విజయనగరం అర్బన్: రాష్ట్రంలోని సొండి కులస్తులను ఓబీసీలో చేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిస్తోందని నవ్యాంధ్ర సొండి కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.కోటేశ్వరచౌదరి అన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక కార్యదర్శిని ఉత్తరాంధ్ర బృందంతో కలిసిన అనంతరం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాంధ్రలో అత్యధికంగా ఉండే సొండి కులస్తుల తరపున అమరావతిలోని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జస్టిస్ వి.శంకనారాయణను కలిస్తే ఇదివరకే ఓబీసీలో చేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్టు పేర్కొన్నారన్నారు. మంత్రి ధర్మాన సోదరుల సహకారంతో ఇదే విషయమై అటు నుంచి చీఫ్ సెక్రటరీ కార్యాలయానికి వెళ్లి బీసీ వెల్ఫేర్ డిప్యూటీ సెక్రటరీని కలవగా సొండి కులస్తులను ఓబీసీలో చేర్పించేందుకు రాష్ట్రప్రభుత్వం తరపున లేఖ అందిందని, దానిని కేంద్రప్రభుత్వానికి పంపించినట్లు చెప్పారన్నారు. ఓబీసీ జాబితాలో తమ కులాన్ని చేర్పించేదుకు కృషిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. ప్రత్యేక కార్యదర్శిని కలిసిన వారిలో నవ్యాంధ్ర సొండికుల రాష్ట్ర సంక్షేమ సంఘం లీగల్ అడ్వైజర్ రత్నాల సారథి చౌదరి, బి.రవిచంద్ర, ఆర్.దేవరాజు, పి.తిరుపతిరావు, ఎం.కిశోర్‌కుమార్, ఎం.మల్లికార్జునరావు, లాభాల విశ్వనాథచౌదరి ఉన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,180–00
బంగారం(22సి. 10గ్రా.)	54,350–00
వెండి (కిలో)	75,700–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹ 250

ఫెయిలైన విద్యార్థులకు సువర్ణావకాశం

- సప్లిమెంటరీ పరీక్షల్లో తప్పినా రెగ్యులర్‌గా చేరేందుకు అనుమతి
- పేదవిద్యార్థులకు ఉన్నత స్థాయి చదువులే ప్రభుత్వ లక్ష్యం



రామభద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాల

రామభద్రపురం: సమాజంలో అసమానతలను చదువుతోనే రూపుమాగలం. విద్యతోనే పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధి సాధ్యమన్న లక్ష్యంతో విద్యారంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న సంస్కరణలు తీసుకొస్తున్నారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నారు. టెన్త్, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు చదువు మానేస్తున్నారన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అలాంటి వారు రెగ్యులర్ తరగతుల్లో అవే కోర్సుల్లో తిరిగి చేరేందుకు అనుమతించి మళ్లీ చదువుకోవడానికి అవకాశం కల్పించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థుల విద్యాభివృద్ధికి పాటుపడుతోంది. ఈ మేరకు మిషన్, విజన్ పేరుతో ఈ ఏడాది ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను వలంటీర్ల ద్వారా అమలు చేస్తోంది. జిల్లాలో టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలలో ఫెయిలైన విద్యార్థులు 2,300 మంది, ఇంటర్మీడియట్‌లో ఫెయిలైన విద్యార్థులు దాదాపు 2 వేల మంది ఉన్నట్లు అధికారిక సమాచారం. వలంటీర్లు వారిని గుర్తించి పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించే విధంగా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. విద్యార్థులు ఉన్నత స్థాయి చదువులు చదవాలన్నా, మెరుగైన జీవనోపాధి పొందాలన్నా పది, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత తప్పనిసరి. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు తిరిగి రెగ్యులర్ తరగతుల్లో చేరి చదువుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది.రెగ్యులర్ విద్యార్థులకు ఏ విధంగా విద్యాబోధన ఉంటుందో ఫెయిలైన విద్యార్థులకూ అలాగే ఉంటుంది. ఫెయిలైన వారు చదువుపై నిరాశచెంది మానేయకుండా తిరిగి రెగ్యులర్ తరగతుల్లో చేరి ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అమ్మఒడి, విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, పథకాల వర్తింపుపై ఇప్పటివరకు గైడ్‌లైన్స్ రాలేదు.

– బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ, విజయనగరం

క్లుప్తంగా

కేజీబీవీ స్కిల్ టెస్ట్‌లు నేడు

విజయనగరం అర్బన్: జిల్లాలోని కేజీబీవీలలో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టుల భర్తీలో భాగంగా దరఖాస్తుదారుల ధ్రువపత్రాల పరిశీలన మంగళవారంతో ముగిసింది. ఒక పోస్టుకి ముగ్గురు వంతున ఎంపిక చేశారు. వీరందరికీ బుధవారం నుంచి జామి మండలం కుమరాం కేజీబీవీలో స్కిల్(డెమో) టెస్టులు నిర్వహించనున్నట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తొలిరోజు ఉదయం 11 గంటలకు ప్రిన్సిపాల్ పోస్టులకు, మధ్యాహ్నం 1 గంటకు సీఆర్టీ గణితం, ఫిజిక్స్, మధ్యాహ్నం 2 గంటలకు సీఆర్టీ బయాలజీ, ఇంగ్లిష్ పోస్టులకు స్కిల్ టెస్టులు నిర్వహిస్తామన్నారు. మిగిలిన పోస్టులకు తదుపరి తేదీల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం పంపినట్టు పేర్కొన్నారు.

ఎర్రన్నగుడి వద్ద మరో హెలిప్యాడ్


ఎర్రన్నగుడి వద్ద సిద్ధం చేసిన హెలిప్యాడ్

గరుగుబిల్లి: కురుపాంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి బుధవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా సీఎం దిగేందుకు చినమేరంగిలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో హెలిప్యాడ్‌ను అధికారులు సిద్ధం చేశారు. ఏ మాత్రం వాతావరణం అనుకూలించని పక్షంలో ఎర్రన్నగుడి వద్ద దిగేందుకు వీలుగా మరో హెలిప్యాడ్‌ను సిద్ధం చేసినట్టు పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు, వీఆర్‌ఓ జోజి తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పన


సెంచూరియన్ వీసీ జీఎస్ఎన్ రాజుతో చర్చిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు సుముఖత వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వరరెడ్డి, సమగ్ర శిక్ష కన్సల్టెంట్ సోనాలి సింగ్, విద్యారంగ నిపుణులు డాక్టర్ సోనూల్ తదితరులు వర్సిటీని మంగళవారం సందర్శించారు. ప్రభుత్వం వందలాది మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిన నేపథ్యంలో యూనివర్సిటీ నుంచి పూర్తి సహకారం కావాలని వీసీ జీఎస్ఎన్ రాజును ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమణారావు, డీన్ సన్నీ డియోల్, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సెల్ ఉపాధ్యక్షుడికి సత్కారం


అప్పలకృష్ణను సత్కరిస్తున్న గ్రామస్తులు

విజయనగరం రూరల్: జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు, మండల ప్రసార కమిటీ అధ్యక్షుడు అప్పలకృష్ణను గ్రామస్తులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల నిర్వహించిన జిల్లా బీసీ సంఘం సమావేశంలో ఉపాధ్యక్షుడిగా అప్పలకృష్ణ ఎన్నికవడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి సంఘ పరంగా తన వంతు కృషి చేస్తానన్నారు.

బాధ్యతల స్వీకరణ

నెల్లిమర్ల: మండల విద్యాశాఖ అధికారిణి – 1గా బి.విజయకుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లిమర్ల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న ఆమెకు ఎంఈఓ – 1గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ – 2 ఈపు విజయ్‌కుమార్‌ను కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లిమర్ల నగర పంచాయతీ, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మండలానికి చెందిన హెచ్ఎంలు ఆమెను కలిసి అభినందనలు తెలియజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

విజయనగరం ఫోర్ట్: మండల పరిధిలోని పలు గ్రామాలకు గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎస్ఈ ముప్వల లక్ష్మణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా అంతరాయం కలగనున్నట్టు పేర్కొన్నారు. అయ్యన్నపేట, అయ్యన్నపేట జంక్షన్, పాల్‌నగర్, దుప్పాడ, చిల్లపేట, జొన్నవలస, పినవేమలి, రాకోడు, సారిక, కోరుకొండ, కోరుకొండ పాలేం, కోరుకొండ కొత్తూరు, అట్టాడ, దత్తరాజ్ గార్డెన్, గుంకలాం గ్రామాలకు ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు.

అమ్మఒడి ఆలంబన

- అమ్మ ఒడి పథకం నాలుగో ఏడాది సాయం నేడు తల్లుల ఖాతాల్లో జమ
- నేడు కురుపాం వేదికగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విడుదల
- పార్వతీపురం మన్యం జిల్లాకు తొలిసారిగా విచ్చేస్తున్న ముఖ్యమంత్రి
- ఘనంగా స్వాగతం పలికేందుకు భారీగా ఏర్పాట్లు

'చదువులే పిల్లలకు మనం ఇవ్వగలిగే ఆస్తి. చదువులకు అయ్యే ఖర్చంతా పిల్లలు, రాష్ట్ర భవిష్యత్తుకు పెట్టుబడి అని బలంగా విశ్వసిస్తున్నాను' ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరచుగా చెప్పే మాట ఇది. పేదరికం కారణంగా ఏ తల్లీ తన బిడ్డలను పాఠశాలకు పంపలేని దుస్థితి రాకూడదనే ఉద్దేశంతో ఆయన రాష్ట్రంలో వినూత్నంగా ప్రారంభించిన కార్యక్రమమే.. జగనన్న అమ్మ ఒడి.! ఈ పథకం ద్వారా వరుసగా నాలుగో ఏడాది 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి బుధవారం విడుదల చేయనున్నారు. అర్హత ఉన్న ప్రతి విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాలో నేరుగా బటన్ నొక్కి జమ చేస్తారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం వేదిక కానుంది. కొత్త జిల్లా ఏర్పాటైన తర్వాత తొలిసారిగా విచ్చేస్తున్న ముఖ్యమంత్రికి ఘనంగా స్వాగతం పలికేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేంతవరకూ కార్పొరేట్ స్కూళ్లదే హవా. ప్రభుత్వ విద్యాసంస్థలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. అందుకు భిన్నంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద పిల్లలు చదువుకొనే ప్రభుత్వ విద్యాసంస్థలను మళ్లీ గాడిన పెట్టారు. కార్పొరేట్ స్కూళ్లకు, కాలేజీలకు దీటుగా వేల కోట్ల రూపాయల నిధులను 'మన బడి నాడు–నేడు' కార్యక్రమం ద్వారా వెచ్చిస్తున్నారు. అన్ని సదుపాయాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మరోవైపు పేదవారు సైతం తమ పిల్లలను స్కూళ్లకు పంపించేలా అమ్మ ఒడి పథకం ద్వారా ప్రతి తల్లికీ రూ.15 వేల చొప్పున అందిస్తున్నారు. మూడేళ్లుగా విజయవంతంగా అమలు చేశారు. ఇప్పుడు నాలుగో విడత ఆర్థిక సాయాన్ని బుధవారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయనున్నారు. విజయనగరం జిల్లాలో 1,66,180 మంది లబ్ధిదారులకు రూ.249.27 కోట్ల మేర ఆర్థిక సాయం అందనుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో 83,733 మందికి రూ.129.61 కోట్ల మేర వారి ఖాతాల్లో జమ కానుంది.

ఫలితాలు ప్రస్ఫుటంగా..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న అమ్మ ఒడి కార్యక్రమం ఫలితాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి. ఇటీవల పదోతరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు టాప్ మార్కులు సాధించారు. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ఉత్తమ ప్రతిభ చూపించారు. ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతంగానున్న పార్వతీపురం మన్యం జిల్లా ఇప్పుడు పదో తరగతి ఫలితాల్లో ఏకంగా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఇదే సమయంలో ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాకు విచ్చేస్తుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రూ.75 వేలు నగదు పురస్కారం అందుకుంటున్న నందకిషోర్ (ఫైల్)

జగనన్న అమ్మ ఒడి అమలు ఇలా...

పార్వతీపురం మన్యం జిల్లాలో...

విద్యా సంవత్సరం	లబ్ధి దారుల సంఖ్య	అందించిన మొత్తం (రూ.కోట్లలో)
2019-20	83,821	131.87
2020-21	74,890	112.33
2021-22	86,409	125.60
2022-23	83,733	129.61

విజయనగరం జిల్లాలో...

విద్యా సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	అందించిన మొత్తం (రూ.కోట్లలో)
2019-20	1,73,460	260.19
2020-21	1,63,146	244.72
2021-22	1,73,440	260.16
2022-23	1,66,180	249.27

అమ్మలా అమ్మఒడి ఆదుకుంది



నా పేరు వాలేటి గాయత్రి. మాది దత్తిరాజేరు మండలంలోని మరడాం గ్రామం. మరడాంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదివాను. ఇటీవల విడుదల చేసిన పదోతరగతి పరీక్షల్లో 584 మార్కులు వచ్చాయి. స్కూల్‌ను నాడు–నేడు నిధులతో కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడంతో పాటు సకాలంలో పాఠ్య పుస్తకాలను అందించారు. అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి క్రమం తప్పకుండా చెప్పిన సమయానికి అమ్మఒడి కింద ఆర్థిక సహాయాన్ని అందచేయడంతో చదువుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా సాగిపోయింది.

అమ్మ ఒడి పథకం ఉపయోగపడింది...



అమ్మ ఒడి పథకం కింద ఏటా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సాయం ఎంతో ఉపయోగపడింది. కోటిపాం జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదువుకున్నాను. 562 మార్కులతో కొమరాడ మండలంలో టాపర్‌గా నిలిచాను.

ప్రభుత్వ పోత్సాహం మరువలేనిది...

పిల్లలు చదువు కోసం జగనన్న అందిస్తున్న ప్రోత్సాహం చాలా గొప్పదని గరివిడి మండలంలోని ఏనుగువలస గ్రామానికి చెందిన వెంపడాపు మన్మథరావు, లక్ష్మీ దంపతులు చెబుతున్నారు. వీరి కుమారుడు వెంపడాపు నందకిశోర్ ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో 586 మార్కులు తెచ్చుకుని జిల్లా స్థాయిలో ప్రథమ, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలవడం తమకెంతో సంతోషంగా ఉందని అంటున్నారు.

నా జీవితంలో మర్చిపోలేను...



నేను సాలూరులోని జ్యోతిరావు పూలే ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివాను. ఇటీవల విడుదలైన ఫలితాల్లో 574 మార్కులతో జిల్లాలో తృతీయ స్థానం సాధించాను. ఈ అనుభూతి నా జీవితంలో మర్చిపోలేను. నాడు–నేడు పథకంతో మా పాఠశాలలో విద్యార్థులకు మంచి వాతావరణం, సదుపాయాలను కల్పించి మేము జీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగేలా తోడ్పాటు అందించిన జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– దమరుసింగు లత, సాలూరు

ప్రభుత్వ ప్రోత్సాహంతో...



ఈ ఫొటోలోని విద్యార్థిని పేరు పిల్లా జ్యోత్స్న. తల్లిదండ్రులు పిల్లా చిన్నతల్లి, తిరుపతిరావు. నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో నివాసం. వారికి కూలిపనే ఆధారం. ప్రభుత్వం జగనన్న అమ్మ ఒడి ద్వారా అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహంతో నెల్లిమర్ల రెల్లివీధిలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో చదివించారు. పదోతరగతిలో జ్యోత్స్న 582 మార్కులు సాధించి నెల్లిమర్ల నియోజకవర్గంలోనే టాపర్‌గా నిలిచింది. ప్రభుత్వ ప్రోత్సాహంతో తమ అమ్మాయిని ఉన్నత చదువులు చదివిస్తామని బాలిక తల్లిదండ్రులు ధీమాగా చెబుతున్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుతో...



నా పేరు రుషితా రెడ్డి. నాన్న ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. అమ్మ గృహిణి. నేను విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని కస్పా ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యనభ్యసించాను. వార్షిక పరీక్షల్లో 587 మార్కులు సాధించి జగనన్న ఆణిముత్యాల అవార్డుకు అర్హత సాధించాను. ఇందుకు కారణం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు అవసరమైన విద్యా ప్రమాణాలను మెరుగుపర్చడమే కారణం.

పేదరికాన్ని ఎదిరించి...



సంతకవిటి మండలం రామారాయపురం గ్రామానికి చెందిన పైడి శ్వేత పదోతరగతి ఫలితాల్లో 582 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఈమె తండ్రి హరిబాబు తాపీమేస్త్రి. తల్లి గోవిందమ్మ కూలీ. వాసుదేవపట్నం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శ్వేతను చేర్పించినప్పటికీ ఆర్థికంగా ఇబ్బంది పడేవారు. జగనన్న ప్రభుత్వం ఇస్తున్న అమ్మ ఒడి పథకంలో అందుతున్న డబ్బుతో నాలుగేళ్లు చాలా చక్కగా చదివించగలిగామని చెబుతున్నారు.

జగన్‌మామ సాయంతో...



జగన్ మామ ఇచ్చిన సాయంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుసాగింది. శృంగవరపుకోట మండలంలో సీతారాంపురం గ్రామానికి చెందిన మాది వ్యవసాయ కుటుంబం. నేను ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివాను. మూడేళ్లుగా ఏటా అమ్మఒడి డబ్బులు వచ్చాయి. జగనన్న విద్యా కానుకల కిట్లు ఇచ్చారు. టెన్త్‌లో 569 మార్కులు సాధించాను. ప్రస్తుతం జగన్ మామ కొత్తగా మా పాఠశాలలో మంజూరు చేసిన ప్రభుత్వ బాలికల కళాశాలలోనే ఇంటర్మీడియట్‌లో చేరాను.

– మిడతాన లిఖిత, విద్యార్థిని, సీతారాంపురం

పేదింటి విద్యార్థులకు జగన్‌మామ భరోసా....



పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్నాను. పబ్లిక్‌పరీక్షల ఫలితాల్లో 587 మార్కులు సాధించాను. మా తల్లితండ్రులు పాడి హరిచంద్రప్రసాద్, సుష్మా. ఆణిముత్యాల పేరిట రూ.50 వేలు జిల్లా కలెక్టరు ద్వారా ప్రభుత్వ సాయం అందుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేదింటి విద్యార్థులకు జగన్‌మామ భరోసా కొండంత అండగా కనిపిస్తోంది.

మా కంటూ ఓ గుర్తింపు..



నా పేరు జ్యోత్స్న. పార్వతీపురం కేపీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివాను. మా తల్లిదండ్రులు చిరు వ్యాపారం చేస్తున్నారు. నాకు పదోతరగతి ఫలితాల్లో 582 మార్కులు వచ్చాయి. దీనికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న ప్రోత్సహమే కారణం. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను గుర్తించి సత్కరించడం చాలా ఆనందంగా ఉంది.

చదువుకు భరోసా..

నేను బాడంగి జెడ్పీ హైస్కూల్‌లో చదివాను. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 559 మార్కులతో స్కూల్ ఫస్ట్ వచ్చాను. ఈ స్థాయిలో ముందుండేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పథకాలు దోహదపడ్డాయి. గతంలో నేను, తమ్ముడు అజయ్ చదువుకోవడానికి ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు అలా లేదు. జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక కిట్లతో చదువుకు భరోసా కలిగింది.

– రాజాన హర్షవర్ధన్, బాడంగి


బాడంగి జెడ్పీ హైస్కూల్‌లో నగదు ప్రోత్సాహకాన్ని అందుకుంటున్న హర్షవర్ధన్ (ఫైల్)

టిప్‌'ట్యాబ్'గా...

- పాఠశాలల ఆరంభం నుంచే విద్యాప్రణాళికలు అమలు
- కార్పొరేట్‌ను మరిపిస్తున్న సర్కారీ విద్య
- సద్వినియోగం అవుతున్న బైజూస్ కంటెంట్ యాప్
- జిల్లాలో 9,952 మంది విద్యార్థులకు, 1900 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు
- 263 పాఠశాలల్లో బైజూస్ బోధన
- ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పక్కాగా అమలు


కురుపాం పాఠశాలలో బైజూస్ విద్యాబోధన

పార్వతీపురంటౌన్:

చేతిలో ట్యాబ్.. భుజానికి బ్యాగ్.. చూడచక్కని యూనిఫామ్.. కాళ్లకు నాణ్యమైన షూస్‌తో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ స్కూల్ స్టూడెంట్లను మరిపించేలా వడివడిగా బడికి వెళ్తుంటే.. వారిని చూసిన తల్లిదండ్రులు మురిసిపోతున్నారు. జగనన్న సర్కారు చొరవతో పిల్లల భవిష్యత్తు బంగారుమయమవుతోందని ఆశపడుతున్నారు. పిల్లలను చక్కగా ముస్తాబు చేసి ఊరిబడికి పంపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చక్కని బోధన ప్రణాళికను అమలు చేస్తుండడం, ఇటీవల పదోతరగతి ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రస్థాయిలోనే ముందంజలో ఉండడంతో విద్యాచైతన్యంతో ముందుకు సాగుతున్నారు. పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. బైజూస్ కంటెంట్‌తో ఉన్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికాబద్ధంగా సర్కారు పాఠశాలల్లో చదువులు సాగుతుండడంపై ఆనందం వ్యక్తంచేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని 263 పాఠశాలల్లో బైజూస్ బోధన సాగుతోంది. 8వ తరగతి చదువుతున్న 9,952 మంది విద్యార్థులు, 1900 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను ప్రభుత్వం ఉచితంగా అందించి డిజిటల్ బోధనను చేరువ చేసింది.

అందరిచూపు మనవైపే...

సర్కారు పాఠశాలలకు సాధారణంగా పేద, మధ్యతరగతి వర్గాలకు చెందినవారే అధికంగా వస్తారు. వారికి ఉన్నత విద్యను అందించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందించింది. దేశవ్యాప్తంగా అందరి చూపు ఏపీ వైపు పడేలా చేసింది. ఇప్పటికే మనబడి నాడు–నేడు పథకంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారగా, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద వంటి పథకాలతో పేదల చదువులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రతి విద్యార్థి ట్యాబ్‌ను వినియోగించుకునేలా నిత్యం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థుల చదువే పెట్టుబడిగా...

ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.37వేలు విలువచేసే బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందజేసింది. ట్యాబ్‌ల వినియోగంపై ఉపాధ్యాయులతో పర్యవేక్షిస్తోంది. ట్యాబ్ తీసుకున్న ఉపాధ్యాయుడు, విద్యార్థి అందులోని కంటెంట్‌ను ఎంత మేర వినియోగిస్తున్నారు... ఇప్పటి వరకు ఒక్కో విద్యార్థి ట్యాబ్‌లలో ఉన్న టెస్టులను పూర్తి చేస్తున్నారా? లేదా? తదితర విషయాలపై మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి ఉన్న తాధికారుల వరకు దృష్టి కేంద్రీకరించారు. పాఠశాలల తనిఖీల్లో భాగంగా ట్యాబ్స్ వినియోగాన్ని పరిశీలిస్తున్నారు. ప్రతి ట్యాబ్‌లో 184 టెస్టులు ఉన్నాయి. సబ్జెక్టుల వారీగా కంటెంట్లను చూసి, పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

విజ్ఞానాన్ని పెంచుకునేందుకు



విద్యార్థులు వారు నేర్చుకున్న చదువుకు అదనంగా విజ్ఞానాన్ని పెంచుకునేందుకు ట్యాబ్‌లు దోహదపడతాయి. ఉపాధ్యాయులు కూడా ట్యాబ్‌ల వినియోగంతో వారి పరిజ్ఞానాన్ని మరింతగా పెంచుకోవచ్చు. ట్యాబ్స్ వినియోగంపై నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– ఎస్.ప్రేమ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

పార్వతీపురం మన్యం జిల్లాలో ట్యాబ్‌లు పొందిన విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య ఇలా..

మండలం	విద్యార్థులు	ఉపాధ్యాయులు
బలిజిపేట	393	97
బామిని	530	94
గుమ్మలక్ష్మీపురం	861	119
గరుగుబిల్లి	494	123
జియ్యమ్మవలస	442	116
కొమరాడ	580	112
కురుపాం	702	137
మక్కువ	532	84
పాచిపెంట	702	99
పాలకొండ	546	109
పార్వతీపురం	1155	197
సాలూరు	1037	199
సీతంపేట	983	168
సీతానగరం	462	114
వీరఘట్టం	533	132

గిరిజన ఇంజినీరింగ్ కళాశాల పనుల పరిశీలన


గిరిజన ఇంజినీరింగ్ కళాశాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

కురుపాం: కురుపాం నియోజకవర్గ కేంద్రంలోని టేకరఖండి గ్రామ సమీపంలోని 105 ఎకరాల్లో రూ.150 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న గిరిజన ఇంజినీరింగ్ కళాశాల పనులను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. అనంతరం సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. పనులు ఏ మేరకు జరిగాయి.. ఎప్పటికి పూర్తవుతాయన్న వివరాలపై ఆరా తీశారు. భవన నిర్మాణాల మ్యాప్‌ను పరిశీలించారు. కళాశాలలో విద్యార్థులకు ఏఏ బ్రాంచ్‌లు నిర్వహిస్తారన్న అంశాన్ని జేఎన్‌టీయూ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

'సంక్షేమం'లో రాష్ట్రం దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు


లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం:

సంక్షేమ పథకాల అమలులో దేశానికి ఆదర్శంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని ముక్కాం సచివాలయ పరిధిలో కొండ్రాజుపాలెం, చోడిపిల్లిపేట గ్రామాల్లో మంగళవారం రెండో రోజు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగించారు. ప్రతి ఇంటికి వెళ్లి పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎప్పుడైనా ఇన్ని పథకాలు మీకు అందాయా అని గ్రామస్తులను అడిగారు. గత ప్రభుత్వంలో ప్రతి పనికి జన్మభూమి కమిటీలు పేదలను పీల్చి పిప్పి చేశాయని, ఇప్పుడు జగనన్న పాలనలో నేరుగా ఇంటికే పథకాలు అందటం మీరు చూస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేశంలో మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా ఉందన్నారు. గత టీడీపీ పాలనలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప చంద్రబాబు అండ్ కో ప్రజలకు చేసిన ఒక్క మేలు లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ సూరాడ రాములమ్మ, సూరాడ చిన్నారావు, మత్స్య శాఖ డైరెక్టర్ నరసింహులు, పడాల భానుప్రకాశ్, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, కర్రోతు వెంకటరమణ, కిలారి వెంకటరమణ, కర్రోతు శ్రీనివాసరావు, వాసుపల్లి రొయ్యుడు, పతివాడ రామకృష్ణ, ఎరుపల్లి పెద్దయ్య, దుక్క రమణ, తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.


జననేత జగనన్నకు
స్వాగతం - సుస్వాగతం
జగనన్న అమ్మఒడి కార్యక్రమానికి పార్వతీపురం మన్యం జిల్లాలోని
కురుపాం నియోజకవర్గానికి విచ్చేయుచున్న
మన ప్రియతమ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
గౌ|| శ్రీ వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి గార్కి
మా హృదయపూర్వక
స్వాగత శుభాకాంక్షలు తెలుపుతూ....
అభివృద్ధి పథంలో పార్వతీపురం నియోజకవర్గం
బలిజిపేట మండలంలో
అజ్జాడ - పి.చాకరాపల్లి తారురోడ్డు ప్రారంభోత్సవం
పార్వతీపురంలో మండలంలో లక్ష్మీనారాయణపురంలో
సచివాలయ భవనం ప్రారంభోత్సం
పెంచిన పెన్షన్ పంపిణీ కార్యక్రమం
తాళ్ళ బురిడిలో వంతెన నిర్మాణ పనులు పరిశీలన
మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా
నియోజకవర్గంలో భారీ ర్యాలీలో
నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించిన
వైఎస్సార్ ఆసరా కార్యక్రమం
జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో
విద్యార్థులకు నగదు ప్రోత్సాహం
విజయవంతంగా నిర్వహించిన జగనన్న పచ్చతోరణం,
జగనన్నే మా భవిష్యత్ - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు
గడప గడపకి కార్యక్రమంలో భాగంగా జమదాల
గ్రామంలో తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటూ
సీతానగరం మండలంలో గడప గడపకు మన ప్రభుత్వ
కార్యక్రమంలో ప్రజలతో మమేకమై
పెదబొండపల్లి గ్రామంలో అపూర్వస్పందన
కనిపించిన ఇంటి పట్టాలు పంపిణీ
అలజంగి జోగారావు
శాసనసభ్యులు, పార్వతీపురం

క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

బొబ్బిలి: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని పారాదికి చెందిన బెల్లాన సింహాచలంకు వైద్య ఖర్చుల నిమిత్తం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు మంగళవారం రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితులపై ఆరాతీసి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



బొబ్బిలిలో పారిశుద్ధ్య పరిస్థితులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

బొబ్బిలి: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం అని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక పట్టణంలోని గొల్లపల్లి, కృష్ణాపురం డంపింగ్ యార్డులతో పాటు, రత్నాలనగర్, అమ్మిగారి కోనేరు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. గొల్లపల్లి దాడితల్లి కాలనీలో చేపడుతున్న ఇంటింటి చెత్త సేకరణను చూసిన ఆయన కాలువల్లో మురుగు, పూడికలు తొలగించాలని పారిశుద్ధ్య కార్మికులను ఆదేశించారు.

'మా ఊరు-మా బాధ్యత'



వంగర: తలగాంలో కాలువలోని పూడికలు తొలగిస్తున్న కార్మికులు

వంగర: మా ఊరు-మా బాధ్యత కార్యక్రమంలో భాగంగా మండలంలోని తలగాం గ్రామంలో మంగళవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ సంకిలి రాధ పర్యవేక్షణలో ప్రధాన వీధుల్లోని కాలువల్లో పేరుకుపోయిన మురుగు, పూడికలను కూలీలు తొలగించారు. అనంతరం బ్లీచింగ్ చల్లారు. గ్రామస్తుల ఆరోగ్యమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టామని వారు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవరాజ్, వీఆర్ఓ రాము పాల్గొన్నారు.

చేపల పెంపకంపై శిక్షణ

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామంలో చేపల పెంపకం, ఫిష్ ఆంధ్ర మార్కెట్ నిర్వహణపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. విజయనగరం మత్స్యకార ఎఫ్‌డీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్సీ కుటుంబాల్లో ఆసక్తి ఉన్న పలువురికి ఎస్‌ఎఫ్‌డీబీ సౌజన్యంతో ఈ శిక్షణ అందిస్తున్నామని, శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మొయిద శ్రీనివాసరావు, ఏఐఎఫ్‌లు జి.వెంకటేశ్వరరావు, పీహెచ్‌వీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓగా గౌరినాయుడు

బాడంగి: ఎంఈఓగా డి.గౌరినాయుడు నియమితులైనట్లు ఎంఈఓ-2 ఎం.రాజేశ్వరి మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. గజపతినగరం మండలంలోని పురిటిపెంట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి ఆయన ఎంఈఓగా పదోన్నతిపై ఇక్కడికి వస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు తోటి సిబ్బంది అభినందనలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాడంగి: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.రామదాసు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మొత్తం 62 సీట్లను భర్తీ చేయనున్నామని, బుధవారం వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూలై 1వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

వినతిపత్రం అందజేత

రాజాం సిటీ: మధ్యాహ్న భోజనం పథకం మెనూ చార్జీలు పెంచడంతో పాటు గ్యాస్ సిలిండర్‌ను ఉచితంగా అందజేయాలని ఎంఈఓ పి.నాగయ్యకు వంట నిర్వాహకులు కృష్ణవేణి, హైమావతి మంగళవారం వినతిపత్రం అందజేశారు. గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు కనీస వేతనాలు అమలు చేయకుండా పనిచేయించుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వెళ్లి, ఈకేవైసీ..

తెర్లాం: జగనన్న అమ్మఒడి పథకానికి సంబంధించి, ఓ వలంటీర్ హైదరాబాద్ వెళ్లి, మరీ ఈకేవైసీ చేయడాన్ని అందరూ అభినందిస్తున్నారు. మండలంలోని పూనువలసకు చెందిన పలువురు విద్యార్థుల తల్లులు పనిచేసేందుకు హైదరాబాద్ వెళ్లారు. ఈ నెల 28వ తేదీన జగనన్న అమ్మఒడి పథకం నాలుగో విడత నిధులను విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమంను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవడం తప్పనిసరి. దీంతో పాటు మంగళవారమే ఈకేవైసీ నమోదు గడువు ముగియడంతో గడువులోపే వారి వద్దకు వలంటీర్ వెళ్లి, ఈకేవైసీ చేయడంపై విద్యార్థుల తల్లులు ఆనందం వ్యక్తం చేస్తూ సదరు వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

- రాగుల సాగు విస్తీర్ణం రెట్టింపునకు చర్యలు
- జూలై నుంచి ఫోర్టిఫైడ్ గోధుమ పిండి పంపిణీ
- ధాన్యం మిల్లులో డ్రయ్యర్, సీసీ కెమెరాలు తప్పనిసరి
- గ్యాస్ సిలిండర్ల సరఫరాకు అదనంగా వసూలు చేస్తే చర్యలు
- మంత్రులు బొత్స సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు
- చిరుధాన్యాలసాగు, ధాన్యం సేకరణపై అధికారులతో సమీక్ష



ఫోర్టిఫైడ్ గోధుమ పిండి పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రులు నాగేశ్వరరావు, బొత్స సత్యనారాయణ, అధికారులు

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రజల ఆరోగ్యం దృష్ట్యా చిరుధాన్యాల వినియోగం, సాగును ప్రోత్సహిస్తున్నామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పౌర సరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు స్పష్టంచేశారు. దీనిలో భాగంగానే రేషన్‌డిపోల ద్వారా రాగులు, జొన్నలు పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారని చెప్పారు. చిరుధాన్యాల సాగు, ధాన్యం సేకరణపై ఉత్తరాంధ్ర జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాలు, విజిలెన్స్, తూనికలు కొలతలు, వ్యవసాయ శాఖాధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్, పౌర సరఫరాల సంస్థ ఎండీ వీరపాండ్యన్ మాట్లాడుతూ చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వివరించారు. తమ జిల్లాల్లో చిరుధాన్యాలలో ప్రధానంగా రాగిపంట సాగు, దాని విస్తరణకు ఉన్న అవకాశాలను జాయింట్ కలెక్టర్లు పీపీటీ ద్వారా వివరించారు. పంట విస్తరణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అన్ని జిల్లాల్లో రాగుల సాగును రెట్టింపు చేయాలని అధికారులకు మంత్రి కారుమూరి సూచించారు. ప్రభుత్వం రాగులకు క్వింటాకు రూ.3,480 చొప్పున గిట్టుబాటు ధర కల్పిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకొని, రాగుల సాగు విస్తీర్ణం పెంచాలని కోరారు. ఎంత పండిస్తే అంతా కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర అవసరాలను తగినంతగా రాగులు, జొన్నలు సాగవ్వడం లేదని, వీటి సాగును గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల కాలంలో ప్రబలుతున్న సుగర్, బీపీలాంటి జీవనశైలి వ్యాధుల నియంత్రణకు చిరుధాన్యాల వినియోగం అవసరమని ఉద్ఘాటించారు.

గిట్టుబాటు ధర కల్పిస్తే సాగుబాగు..

ఒకప్పుడు విజయనగరం జిల్లాలో చోడి (రాగులు) సాగు ఎక్కువగా ఉండేదని, సాగునీటి సదుపాయాలు పెరగడంతో వరి, ఉద్యాన పంటల సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారని మంత్రి బొత్స తెలిపారు. రైతు శ్రమకు తగిన గిట్టుబాటు ధరను కల్పించి పూర్తి సహకారాన్ని అందించినప్పుడే రాగుల సాగు విస్తీర్ణం పెరుగుతుందని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సాగు విస్తీర్ణం పెంచడంలో వ్యవసాయాధికారులదే కీలకపాత్రగా పేర్కొన్నారు. ఏ పంట లాభదాయకమో దానిని ఎంచుకొనే స్వేచ్ఛ రైతుకు ఉందన్నారు. అతితక్కువ పెట్టుబడితో రాగులను సాగు చెయవచ్చని, భారీ తుపానులు వస్తేతప్ప పంటకు నష్టం వాటిల్లదన్నారు. ధాన్యం మిల్లుల్లో సీసీ కెమెరాలు, డ్రయ్యర్ల ఏర్పాటు కోసం రుణ సౌకర్యాన్ని కల్పించాలని సూచించారు. చెల్లించిన బ్యాంకు గ్యారంటీలను బట్టి కాకుండా, మిల్లింగ్ చేసే సామర్థ్యాన్ని బట్టే రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించాలని మంత్రి స్పష్టం చేశారు. గత ఏడాది జిల్లాలో ధాన్యం దిగుబడి గణనీయంగా పెరిగిందని, అయినప్పటికీ ఎక్కడా ఎటువంటి ఇబ్బందీ రాకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను చక్కగా పూర్తి చేశారని అధికారులను మంత్రి అభినందించారు. వరుణుడు తమ పార్టీలో చేరిపోయాడని, అందువల్లే ఈ నాలుగేళ్లూ సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండుతున్నాయని చమత్కరించారు.

జూలై నుంచి ఫోర్టిఫైడ్ గోధుమ పిండి పంపిణీ

జూలై నుంచి రాష్ట్రంలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో కిలో రూ.16 చొప్పున ఫోర్టిఫైడ్ గోధుమ పిండిని రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేస్తామని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా గోధుమ పిండిని పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి యోచిస్తున్నారన్నారు.



కలెక్టర్ కార్యాలయంలో అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు కె.నాగేశ్వరరావు, బొత్స సత్యనారాయణ

ధాన్యం కొనుగోలు వ్యవస్థను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, గత సీజన్‌లో 98 శాతం మందికి డబ్బులు జమచేశామని చెప్పారు. గోనె సంచులు, రవాణా చార్జీలను కూడా చెల్లించామన్నారు. ప్రతి ధాన్యం మిల్లులో తప్పనిసరిగా డ్రయ్యర్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీని వల్ల రాష్ట్ర స్థాయి నుంచే మిల్లులను పర్యవేక్షించవచ్చన్నారు. వచ్చే సీజన్‌లో మూడు లేదా నాలుగు రోజుల్లోనే ధాన్యం డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గిరిజనులు పండించే చిరుధాన్యాలను సంతల్లో కూడా సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కందిపప్పు లభ్యత అంతగా లేదని, ఆగస్టు నుంచి దీనిని సరఫరా చేస్తామని మంత్రి ప్రకటించారు. అనంతరం గోధుమ పిండి పంపిణీ ప్యాకెట్లను మంత్రులిద్దరూ లాంఛనంగా ప్రారంభించారు. సమావేశంలో విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కె.మయూర్ అశోక్, శ్రీకాకుళం జేసీ నవీన్‌కుమార్, అనకాపల్లి జేసీ జాన్వీ, ఆరు జిల్లాల పౌర సరఫరాల అధికారులు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్లు, విజిలెన్స్, తూనికలు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధి, మారుతీ కాలనీలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు కాలనీవాసులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు తమకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరగా, అర్హులందరికీ ఇళ్ల స్థలాలు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఆయన దృష్టికి వచ్చిన అక్కడి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఈఓ సుప్రియను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమాన ప్రాధాన్యం ఇస్తున్న ఘనత ఆయనదేనన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో గ్రామ స్థాయిలోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. దీంతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, లబ్ధిదారుల వద్దకు పథకాలు వచ్చి చేరుతున్నాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చడం జరిగిందన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతీ ఇంటికి మేలు జరిగేలా జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ఇప్పటివరకు అమలైన పథకాల్లో ఏ ఒక్క పథకంలో ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. గతంలో ఏ ఒక్క అభివృద్ధి పని జరగాలన్నా, సంక్షేమ పథకం కావాలన్నా అప్పటి జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అప్పటి టీడీపీకి ఇప్పటి వైఎస్సార్ సీపీకి పాలనలో చాలా తేడా ఉందన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి తీసుకురావాలని, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, బొబ్బిలి మండల పార్టీ అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు



మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం సిటీ: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికస్వావలంబన సాధించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపడుతున్నారన్నారు. ఇందులో భాగంగానే మహిళలతో చిన్నతరహా పరిశ్రమలు స్థాపించి, ప్రోత్సహించేందుకు రాయితీలు కల్పిస్తున్నారన్నారు. ప్రతీ మహిళ కుటీర పరిశ్రమల ద్వారా సొంతంగా తయారు చేసిన ఉత్పత్తులను ఈ మార్కెట్ ద్వారా విక్రయించి, ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. తాము ఉపాధి పొందుతూ మరికొంతమందికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళలు విక్రయానికి ఉంచిన ఉత్పత్తుల తయారీ విధానం, దానికి అయ్యే ఖర్చు, అమ్మకం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మెప్మా టీఎంసీ ఎస్వీ రత్నం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్, పట్టుశాలి కార్పొరేషన్ డైరెక్టర్ బి.లలిత తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలో భూముల రీసర్వే



భూముల సరిహద్దు గుర్తింపు మ్యాపును పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బొబ్బిలి: రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే చేపట్టాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు సూచించారు. రీసర్వేలో భాగంగా మండలంలోని వెంకటరాయుడిపేట గ్రామంలో చేపడుతున్న గ్రౌండ్ ట్రూథింగ్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ భూముల రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. సర్వే జరుగుతున్నప్పుడు రైతులు దగ్గరుండాలని, కొలతల్లో ఏవైనా తేడాలు వస్తే సంబంధిత ఆధారాలతో అధికారులను సంప్రదిస్తే సరిచేస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ అప్పయ్య, వీఆర్ఓ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

బొబ్బిలి: పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, సీసీ డెయిన్ల నిర్మాణాలకు మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు మంగళవారం భూమిపూజ చేశారు. అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, 15వ ఆర్థిక సంఘం, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. 1వ వార్డులో రూ.7 లక్షలు, 1, 2 వార్డుల్లో రూ.12 లక్షలు, తారకరామా కాలనీ 31వ వార్డులో రూ.5 లక్షలు, మల్లంపేట 23వ వార్డులో రూ.5 లక్షలు, నాయుడు కాలనీ 21వ వార్డులో రూ.5 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు రమేష్‌నాయుడు, పార్వతి పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సుల సంఖ్య పెంచాలి

వంగర: రాజాం పట్టణంలో చదువుకునేందుకు వెళ్తున్న విద్యార్థుల కోసం ప్రస్తుతం నడుపుతున్న బస్సుల సంఖ్యను పెంచాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇదే విషయమై మండలంలోని అరసాడ జంక్షన్ వద్ద పలు గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులను విద్యార్థులు మంగళవారం అడ్డుకుని, నిరసన తెలిపారు. ఉదయం విద్యాసంస్థలకు వెళ్లేటప్పుడు, సాయంత్రం ఇంటికి బస్సుల్లో వచ్చేటప్పుడు ఇరుకుఇరుకుగా ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిసార్లు స్థలం లేని కారణంగా ఫుట్‌బోర్డు ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి, విద్యార్థుల కోసం అదనంగా బస్సులు నడపాలని కోరారు.

'నేతన్న నేస్తం' దరఖాస్తుదారుల అర్హత పరిశీలన



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

వంగర: మండలంలోని పటువర్ధనం, మగ్గూరు గ్రామాల్లో నేతన్న నేస్తం పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లిన ఆయన వారు చేసుకున్న దరఖాస్తులు, పథకం లబ్ధి పొందేందుకు వారికున్న అర్హతలను సరిచూశారు. అర్హులందరికీ ప్రభుత్వం పథకాలు అందిస్తామని తెలిపారు.

ఇద్దరికి గాయాలు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మయ్యపేట సమీపంలో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. గాయత్రి కాలనీకి చెందిన భీంపల్లి తిరుపతిరావు మండల పరిధిలోని మారెడుబాక నుంచి తిమ్మయ్యపేట వస్తుండగా, రోడ్డుపైన ఉన్న గొయ్యి వద్ద అదుపు తప్పిపడిపోయాడు. దీంతో గాయాలపాలైన అతడిని స్థానికులు రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందజేశారు. అలాగే చీపురుపల్లికి చెందిన ఐ.సతీష్ రాజాం నుంచి స్వగ్రామం వెళ్తూ గోతిలో పడి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికుల సహాయంతో చీపురుపల్లి ఆస్పత్రికి క్షతగాత్రుడిని తరలించారు.

రైల్వే ఔట్‌పోస్ట్ పరిశీలన

బొబ్బిలి: స్థానిక రైల్వే అవుట్‌పోస్టును విశాఖపట్నం రైల్వే లైన్ సీఐ వెంకటరావు మంగళవారం పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా విచ్చేసిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. మాదకద్రవ్యాల రవాణా జరగకుండా చూడాలని తెలిపారు.

కుట్టుమిషన్ షాపులకు స్త్రీనిధి రుణాలు

రేగిడి: మహిళలు సొంతంగా కుట్టుమిషన్ షాపులు పెట్టుకుంటే స్త్రీనిధి రుణాలు అందిస్తామని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద మహిళలకు ఇస్తున్న కుట్టుమిషన్ శిక్షణను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల్లో ఆర్థిక చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కుట్టుమిషన్ శిక్షణ పొందిన వారికి విజయవాడలో ఉపాధి కల్పిస్తామన్నారు. జిల్లాలో 10 చోట్ల ఈ శిక్షణ ఇస్తున్నామని, ఒక్కో చోట 30 మంది శిక్షణ పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం టి.మంగమ్మ, ఎంఎంఎస్ అధ్యక్షురాలు ఎస్.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారంజకపాలనే ప్రభుత్వ లక్ష్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: ప్రజారంజకపాలన అందించడమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలోని మీనాక్షి కాలనీ, యాతపేట, మల్లయ్యపేటలో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా ప్రాంతాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్ల ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలన్నీ నెరవేరుస్తున్నారన్నారు. ప్రతీ ఇంటికి లబ్ధి జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేశారని, గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు నిర్మిస్తూ ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు అందేలా చూస్తున్నారన్నారు. గతంలో టీడీపీ హయాంలో జనం చూడని సంక్షేమం, అభివృద్ధి ఈ ప్రభుత్వ హయాంలో జరుగుతోందన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ సీఎం జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ బి.లలితకుమారి, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు పాల్గొన్నారు.

'జగనన్న ఆణిముత్యాలు'కు సత్కారం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు

వంగర: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు చేతులమీదుగా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను నగదు ప్రోత్సాహకం, ప్రశంసా పత్రం, మెడల్‌తో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, అలాంటప్పుడే జీవితంలో ఉన్నత స్థానం చేరుకోగలమన్నారు. ప్రతిఒక్కరూ బాగా చదివి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ వై.దుర్గారావు, ప్రధానోపాధ్యాయులు ఎం.రమణమ్మ, నాగభూషణ దొర పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుపై తల్లిదండ్రుల బాధ్యత పెరగాలి



బాడంగి: మాట్లాడుతున్న జెడ్పీటీసీ రామారావు

రాజాం సిటీ: విద్యార్థుల చదువుపై తల్లిదండ్రుల బాధ్యత కూడా పెరగాలని మండలంలోని పొగిరి గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.సత్యనారాయణ అన్నారు. మంగళవారం అదే పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల కమిటీ సమావేశానికి హాజరైన ఆయన విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెర్లాం: మండలంలోని వెలగవలస గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎంఈఓ త్రినాధరావు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని వివరించారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన తల్లిదండ్రుల కమిటీ సమావేశానికి హాజరైన జెడ్పీటీసీ పెద్దింటి రామారావు కాసేపు మాట్లాడారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోందని, విద్యార్థుల శతశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ డి.శ్రీనివాసరావు, ఎంఈఓ-2 ఎం.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'నైరెడ్'ను సందర్శించిన నాబార్డు బృందం



టైలరింగ్ శిక్షణార్థులతో మాట్లాడుతున్న నాబార్డు బృంద సభ్యులు

రాజాం: స్థానిక పట్టణంలోని జీఎంఆర్ వీఎఫ్ నైరెడ్ ఉచిత శిక్షణ శిబిరాన్ని నాబార్డు బృందం మంగళవారం సందర్శించింది. ఆ సంస్థ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ పీవీఎస్ సూర్యకుమార్‌తో పాటు మరికొంతమంది సభ్యులు తొలుత రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషన్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న శిక్షణార్థులతో కాసేపు మాట్లాడి, శిక్షణ ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ నేర్పించే ప్రతీ అంశం చక్కగా నేర్చుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. నాబార్డు సభ్యుడు ఎంఆర్ గోపాల్ మాట్లాడుతూ జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ అన్ని వసతులు కల్పించి, ఉచితంగా ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు అందజేస్తూ వేలాదిమంది యువతీ యువకులకు ఆర్థిక చేయూతనిస్తుండడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రస్తుతం రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషన్ విభాగంలో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం టైలరింగ్, హోమ్ నర్సింగ్ వంటి శిక్షణ తరగతులు పరిశీలించి, శిక్షణార్థులకు ఆన్‌జాబ్ ట్రైనింగ్ పత్రాలు, కిట్లు అందజేశారు. కార్యక్రమంలో నాబార్డు డీజీఎం కేవీఎస్ ప్రసాద్, డీడీఎం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం సభను విజయవంతం చేయాలి

పార్వతీపురం/గరుగుబిల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కురుపాంలో నిర్వహించనున్న బహిరంగ సభకు మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో తరలిరావాలని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం పి.అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని ఆయా గ్రామైక్య సంఘాల అధ్యక్షులకు సీఎం పర్యటనకు సంబంధించిన వివరాలు తెలియజేయడం జరిగిందన్నారు. కొత్తపల్లి, గరుగుబిల్లి, పెద్దూరు, ఉద్దవోలు, రావుపల్లి తదితర గ్రామైక్య సంఘాల అధ్యక్షులతో మంగళవారం సమీక్ష నిర్వహించి సంఘాల సభ్యులంతా సీఎం సభకు తరలివచ్చేలా అవగాహన కల్పించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మొట్టమొదటి సారిగా కురుపాం వస్తున్నందున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పోలమాంబను దర్శించుకున్న భక్తులు


పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో మంగళవారం దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలమాంబ అమ్మవారి జాతరను రాష్ట్ర పండగగా ఈ ఏడాది గుర్తించడంతో, భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, ఈవో వి.రాధాకృష్ణ తెలిపారు. చదురుగుడి, వనంగుడిలో ఉన్న పోలమాంబ అమ్మవార్లను భక్తులు దర్శించుకొని, అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వనంగుడి ఆలయం ఎదుట సరాయివలస గ్రామానికి చెందిన కళాకారులు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది.

నాలుగు వాహనాలకు వేలం రేపు

సీతానగరం: వివిధ కేసుల్లో ఇటీవల పట్టుబడిన మూడు ద్విచక్రవాహనాలు, ఒక కారుకు ఈనెల 29న స్థానిక ఎస్ఈబీ కార్యాలయం ఆవరణలో వేలం వేయనున్నట్లు సీతానగరం ఎస్ఈబీ స్టేషన్‌హౌస్ అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో డిప్యూటీ కమిషనర్ ఆదేశాలమేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఎస్ఈబీ కార్యాలయం వద్ద బుధవారం వేలం వేస్తామని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన వారు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

బుద్ధ, కల్కి అవతారాల్లో జగన్నాథస్వామి


బుద్ధావతారంలో దర్శనం ఇస్తున్న స్వామివారు

బలిజిపేట: జగన్నాథస్వామి రథోత్సవంలో భాగంగా ఎనిమిదవ రోజు మంగళవారం స్వామివారిని బుద్ధ, కల్కి అవతారాల్లో అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకుడు హరి ఆధ్వర్యంలో గుండిచా మందిరం వద్ద స్వామివారికి అవతారాలను మార్పుచేశారు. బుధవారం మారురథయాత్ర కావడంతో ఆలయప్రాంగణంలో ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలనుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని జాతరను తిలకించి సంబరాలు జరుపుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. గుండిచా మందిరం వద్దకు గ్రామంలో భక్తులు వచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారిని దర్శించుకుంటున్నారు.

పక్కాగా జగనన్న సురక్ష సర్వే


సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్

సాలూరు: జూలై 1 నుండి మండలంలో జరగబోయే జగనన్న సురక్ష కార్యక్రమాలు విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సచివాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించే తేదీకి వారం రోజులు ముందు నుండి సదరు సచివాలయ పరిధిలో వలంటీర్లు యాప్‌లో జగనన్న సురక్ష సర్వే చేయాల్సి ఉంటుందని వివరించారు. వలంటీర్లందరు తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి శతశాతం సర్వే చేయాలన్నారు. లబ్ధిదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మిగులు సీట్ల భర్తీకి 30న ప్రవేశ పరీక్ష

గరుగుబిల్లి: గరుగుబిల్లి అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మిగిలివున్న సీట్ల భర్తీకి ఈనెల 30న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.సంధ్యారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో తొమ్మిది సీట్లు, 7వ తరగతిలో రెండు సీట్లు, 8వ తరగతిలో మూడు సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 28లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ విద్యకు ప్రోత్సాహం

అభినందనీయం


బలిజిపేట: సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ జగదీశ్వరరావు


సీతానగరం పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు

సీతానగరం: జగనన్న ప్రభుత్వం విద్యాభివృద్ధికి పథకాలతో పాటు పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను సక్రమంగా వినియోగించుకోవాలని ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ కొల్లా శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభించిన నాటి నుంచి విద్యాసంవత్సరం ముగిసేవరకూ ఉపాధ్యాయులు ప్రణాళికాయుతంగా విద్యాబోధనచేసి శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కోరారు.

మరిపివలసలో..

మండలంలోని మరిపివలస ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంఈఓలు జి సూరిదేముడు, ఎం.వెంకటరమణ మాట్లాడుతూ పాఠశాలలో హాజరు శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులను కోరారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆర్.వెంకటరమణ మాట్లాడుతూ ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలి

బలిజిపేట: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు కృషిచేయాలని పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ జగదీశ్వరరావు కోరారు. ఈ మేరకు మండలంలోని వెంగళరాయపురం ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాన్ని ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించగా సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు బడిఈడు పిల్లలను ఇతర ప్రాంతాల్లోని పాఠశాలల్లో చేర్చకుండా గ్రామంలో ఉండే పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వం నుంచి అన్నీ ఉచితంగా అందుతున్నాయని, ప్రభుత్వం అదనంగా మరో ఉపాధ్యాయుడిని ఈ పాఠశాలకు కేటాయించిందని చెప్పారు. విద్యార్థుల సంఖ్య ఇంకా పెరిగేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదివాసీ ప్రాంతం ఆత్మీయ ఆహ్వానం

పార్వతీపురంటౌన్:


డీవీజీ శంకరరావు

అమ్మఒడి నాల్గవ విడత నిధులు విడుదల చేయడానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి ఆదివాసీ ప్రాంతం ఆత్మీయ ఆహ్వానం పలుకుతోందని మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాకు తొలిసారిగా వస్తున్న ముఖ్యమంత్రికి ఈ ప్రాంతీయులు రుణపడి ఉంటారన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు ఒక్కో పార్లమెంట్‌ను ఒక్కో జిల్లాగా మార్పు తదితర అంశాలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చొరవతోనే జరిగిందన్నారు. కురుపాం, సీతంపేటలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయడం, పార్వతీపురంలో ప్రభుత్వ వైద్యకళాశాల మంజూరు, సాలూరులో గిరిజన విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పడం వల్ల ఈ జిల్లాకే కాకుండా ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టే బృహత్తర ప్రయత్నం సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేశారని ప్రశంసించారు. పార్వతీపురంలో సూపర్‌స్పెషాల్టీ ఆస్పత్రి, మండలానికి రెండు ప్రాథమిక ఆస్పత్రులు, ప్రతి గ్రామంలో విలేజ్ క్లినిక్‌లు, ఇంటింటికి వచ్చే ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థతో ప్రజలకు వైద్యం మరింత అందుబాటులోకి వచ్చిందన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, నాడు–నేడు లాంటి వినూత్న పథకాల అమలు వల్ల పేదలు నాణ్యమైన చదువులు చదువుకునే అవకాశం వచ్చిందని సంతృప్తి వెలిబుచ్చారు.

విద్యా పథకాలపై అవగాహన


వెంకటభైరిపురంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం

మక్కువ: జగనన్న ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన తదితర పథకాలపై, విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు మంగళవారం అవగాహన కల్పించారు. మండలంలోని వెంకటభైరిపురం, శంబరహెచ్‌సీ తదితర పాఠశాలల్లో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్య కోసం ఎంతో ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. నాడు – నేడు పథకం ప్రవేశపెట్టి, పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న విద్యాదీవెన,. జగనన్న గోరుముద్ద, జగనన్న ఆణిముత్యాలు, ఇంగ్లిష్ విద్య తదితర పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం

సీతంపేట: దోనుబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమపాఠశాలలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కొండగొర్రె సుబ్బారావు మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ జగనన్న విద్యాకిట్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో మౌలికవసతులు కల్పించడం జరిగిందన్నారు. అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఈ నెల 28న ప్రభుత్వం అమ్మఒడి నిధులు జమ చేయనున్నందన్నారు. విద్యార్థులంతా ఇళ్లకు వెళ్లకుండా ఇక్కడే ఉండి చదువుకోవాలని సూచించారు.

జగనన్న సురక్ష అమలుకు సర్వే


బూర్జలో జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని బూర్జలో సచివాలయ ఉద్యోగులు, కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమపథకాలు అందివ్వడానికి వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్తూ కుటుంబసభ్యులను సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించడానికి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాలని సూచించారు. వ్యక్తిగత, సామాజిక సంక్షేమ పథకాలతో పాటు కుటుంబసభ్యుల పిల్లలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఇళ్లవద్దనే ఉచితంగా అందజేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సర్వే చేస్తున్న వలంటీర్లకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందడానికి అవసరమైన సమాచారాన్ని ఇంటి యజమానులు లేదా కుటుంబసభ్యులు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కార్యదర్శి శ్రీనివాసరావు, సర్పంచ్ జి దాసు, ఎంపీటీసీ జి.చిన్నంనాయుడు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు


భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

• ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మున్సిపాల్టీ పరిధిలోని 11వ వార్డుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధుల్లో రూ.5లక్షల అంచనా వ్యయంతో సీసీ కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన వినతుల మేరకు తక్షణం అభివృద్ధి పనులను చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పైడితల్లి వారోత్సవాలు


బిందెల డ్యాన్సు సందడి

వీరఘట్టం: మండలంలోని నడుకూరులో పైడితల్లి అమ్మవారి వారోత్సవాలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇటీవల గ్రామానికి చెందిన యువత ముందుకు వచ్చి సుమారు రూ.5 లక్షలు ఖర్చు చేసి, గ్రామపెద్దల సహకారంతో పైడితల్లి అమ్మవారి గుడిని నిర్మించారు.

అమ్మవారి వారోత్సవాల సందర్భంగా బంధువులు, స్నేహితులతో గ్రామంలో సందడి నెలకొంది. దేవతామూర్తుల వేషధారణలు, బిందెల డాన్సులు, ఘటాల ఊరేగింపుతో గ్రామంలో పండగ వాతావరణం సంతరించుకుంది. గురువారంతో ఈ వారోత్సవాలు ముగుస్తాయని, చివరిరోజు అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

యుద్ధప్రాతిపధికన పనులు పూర్తిచేయాలి

• ఎమ్మెల్యే కళావతి


రహదారి విస్తరణ పనులపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: వీరఘట్టం పట్టణ అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వీరఘట్టం రోడ్డు పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. జాయింట్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి రోడ్డు పనుల్లో వేగం పెంచాలని డీఈ గౌరీశ్వరరావు, జేఈ జగన్‌మోహన్‌రాజును ఆదేశించారు. ఆర్అండ్ బీ, ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలని, ప్రజలకు విద్యుత్, తాగునీరు సరఫరాలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. వారితో పాటు కాంట్రాక్టర్లు చంద్రశేఖర్, అనీల్ కుమార్ ఉన్నారు.

వైభవంగా రథాలమ్మ పండుగ

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం గ్రామంలో రథాలమ్మ పండుగ వైభవంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం కోలాటం, బుర్రకథ ప్రదర్శన జరిగాయి. రథాలమ్మ తల్లిని కోలాటం, డప్పులు, వాయిద్యాల నడుమ గ్రామంలోని అన్ని వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నారు. బుధవారం అనుపపండుగా కావడంతో కోళ్లు, గొర్రెలు, చీరలతో మొక్కులు తీర్చుకోనున్నట్లు గ్రామస్తులు చెప్పారు.


కోలాటంగా రథాలమ్మతల్లి ఘటాలు ఊరేగింపు

కుష్ఠువ్యాధిపై అపోహలు వద్దు


అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ వెంకటరమణ

బలిజిపేట: కుష్ఠువ్యాధిపై ఎటువంటి అపోహలు వద్దని బలిజిపేట సీహెచ్ఓ వెంకటరమణ కోరారు. ఈ మేరకు జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వ్యాధిపై బలిజిపేటలో మంగళవారం అవగాహన కల్పించి, వ్యాధి లక్షణాలను పరిశీలించారు. కుష్ఠువ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి సరైన వైద్యసేవలు పొందాలని సూచించారు. ఇది అంటువ్యాధి కాదని తెలిపారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, అరచేతులు స్పర్శకోల్పోవడం, ముక్కులో రక్తం కారడం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. ఎటువంటి అనుమానం కలిగినా వెంటనే వైద్యులను సంప్రదించి తగిన వైద్యాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో తెగులు నివారణ


రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మేలైన వ్యవసాయ పద్ధతులు అవలంబించినప్పుడే వరినారులో తెగులు నివారణ సాధ్యమతుందని ఏఓ ఎస్. అవినాష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని ఆర్. వెంకంపేటలో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంబడిలో భాగంగా విత్తనశుద్ధి కార్యక్రమంపై రైతులకు శిక్షణ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనం, నేల ద్వారా వ్యాపించే తెగులు, పురుగులను సమర్థవంతంగా నివారించడానికి విత్తనశుద్ధి దోహదపడుతుందన్నారు. శుద్ధికి వినియోగించే మందులు విత్తనంలోకి చొచ్చుకు పోయి శిలీంద్రాలను నాశనం చేస్తాయని, విత్తనశుద్ధి చేసిన తర్వాత మొలకెత్తిన లేత మొక్కలు నేలలో ఉన్న శిలీంద్రాల నుంచి రక్షణ పొందుతాయని, తక్కువ ఖర్చుతో పురుగులు, తెగులు పంటను ఆశించకుండా చేయవచ్చని, విత్తనం మొలక శాతం పెరగడానికి దోహదపడుతుదని రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు, ఏపీసీఎన్ఎఫ్ విభాగం ఎన్ఎఫ్ఎఫ్ రైతులు పాల్గొన్నారు.

పిల్లల పోషణ పరిశీలించాలి


పిల్లల బరువును పరిశీలిస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: పిల్లల పోషణను ఎప్పటికప్పుడు పరిశీలించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఆస్పత్రిలోని ఎన్ఆర్‌సీ(పోషకాహార పునరావాస కేంద్రం)ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బరువు తక్కువగా ఉండి (పోషకాహార లోపం తదితర కారణాలతో) ఆస్పత్రిలో అడ్మిట్ అయిన పిల్లల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పిల్లలు ఆస్పత్రిలో చేరిన నాటిన నుంచి ప్రస్తుతం ఏ మేరకు బరువు ఉన్నారో స్వయంగా పరిశీలించారు. ప్రతిరోజూ వారి ఆరోగ్య స్థితిని పరిశీలించి గ్రోత్ చార్ట్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. చిన్నారులకు అందజేస్తున్న పోషకాహార మెనూ, సిరప్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు సూపర్‌వైజర్ జయగౌడ్ తదితరులున్నారు.

మూడు నెలల్లో వంతెన పూర్తి

• ఐటీడీఏ ఈఎన్‌సీ శ్రీనివాసరావు


వంతెన నిర్మాణం చేపట్టనున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ ఈఎన్‌సీ శ్రీనివాసరావు

పాచిపెంట: మండలంలోని పద్మాపురం నుంచి ఈతమానువలస వెళ్లే దారిలో ఉన్న మాసాలగెడ్డపై వంతెన నిర్మాణ పనులు మూడు నెలల్లో పూర్తి చేయనున్నట్లు ఐటీడీఏ ఈఎన్‌సీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం నుంచి నిర్మాణ పనులు ప్రారంభించనున్న నేపథ్యంలో వంతెన నిర్మాణం చేపట్టనున్న ప్రదేశాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. డీఈ మణిరాజు, ఏఈ సత్యనారాయణలకు నిర్మాణానికి సంబంధించి తగు సూచనలు సలహాలు చేశారు. ఈ వంతెన సుమారు రూ.కోటితో నిర్మాణ పనులు చేపడుతున్నామని సెప్టెంబర్ చివరి నాటికి 100శాతం పనులు పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు ఉన్నారు.

అజేయ లంక...

- వరుసగా నాలుగో విజయంతో గ్రూప్ 'బి'లో టాప్ ర్యాంక్
- చివరి లీగ్ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై గెలుపు


అసలంక

హరారే: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ క్రికెట్ టోర్నీ శ్రీలంక జట్టు లీగ్ దశను అజేయంగా ముగించింది. గ్రూప్ 'బి'లో భాగంగా మంగళవారం స్కాట్లాండ్ జట్టుతో జరిగిన చివరిదైన నాలుగో మ్యాచ్‌లో శ్రీలంక 82 పరుగుల తేడాతో గెలిచింది. వరుసగా నాలుగో విజయంతో శ్రీలంక ఎనిమిది పాయింట్లతో గ్రూప్ 'బి' టాపర్‌గా నిలిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 49.3 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (85 బంతుల్లో 75; 10 ఫోర్లు), చరిత్ అసలంక (65 బంతుల్లో 63; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. స్కాట్లాండ్ బౌలర్లలో మార్క్ వాట్ మూడు, క్రిస్ గ్రీవెస్ నాలుగు వికెట్లు తీశారు. 246 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన స్కాట్లాండ్ 29 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌటైంది. క్రిస్ గ్రీవెస్ (41 బంతుల్లో 56 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా మిగతావారు విఫలమయ్యారు. లంక బౌలర్లలో తీక్షణ మూడు, హసరంగ రెండు వికెట్లు పడగొట్టారు.

ఐర్లాండ్‌కు ఊరట...


స్టిర్లింగ్

గ్రూప్ 'బి'లో 'సూపర్ సిక్స్' దశకు చేరుకోలేకపోయిన రెండు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఐర్లాండ్ 138 పరుగుల తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టును ఓడించి విజయంతో టోర్నీని ముగించింది. ముందుగా ఐర్లాండ్ 50 ఓవర్లలో 4 వికెట్లకు 349 పరుగులు సాధించింది. ఓపెనర్ పాల్ స్టిర్లింగ్ (134 బంతుల్లో 162; 15 ఫోర్లు, 8 సిక్స్‌లు) భారీ సెంచరీ... బాల్‌బిర్నీ (66; 5 ఫోర్లు, 1 సిక్స్), హ్యారీ టెక్టర్ (33 బంతుల్లో 57; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. అనంతరం యూఏఈ 39 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. గ్రూప్ 'బి' నుంచి శ్రీలంక, స్కాట్లాండ్, ఒమన్... గ్రూప్ 'ఎ' నుంచి జింబాబ్వే, నెదర్లాండ్స్, వెస్టిండీస్ జట్లు 'సూపర్ సిక్స్' దశకు అర్హత సాధించాయి. గురువారం నుంచి 'సూపర్ సిక్స్' దశ మ్యాచ్‌లు మొదలవుతాయి.

భారత్, కువైట్ మ్యాచ్ 'డ్రా'

బెంగళూరు: దక్షిణాసియా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భాగంగా మంగళవారం భారత్, కువైట్ జట్ల మధ్య జరిగిన చివరి లీగ్ మ్యాచ్ 1–1తో 'డ్రా'గా ముగిసింది. భారత్ తరఫున కెప్టెన్ సునీల్ ఛెత్రి (45+2వ ని.లో) కెరీర్‌లో 92వ గోల్ సాధించగా...



90+2వ నిమిషంలో భారత ప్లేయర్ అన్వర్ చేసిన సెల్ఫ్ గోల్‌తో కువైట్ స్కోరును సమం చేసింది. లీగ్ దశ తర్వాత భారత్, కువైట్ ఏడు పాయింట్లతో సమంగా నిలిచినా... గోల్స్ అంతరం కారణంగా కువైట్ టాపర్‌గా నిలిచింది. భారత్‌కు రెండో స్థానం దక్కింది.

అంకిత ఓటమి



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ అంకిత రైనా తొలి రౌండ్ మ్యాచ్‌లో 6–3, 6–7 (5/7), 1–6తో జెస్సికా (స్పెయిన్) చేతిలో ఓటమి పాలైంది. అంకితకు 12,750 పౌండ్లు (రూ. 13 లక్షల 32 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది.

భారత్ శుభారంభం

బుసాన్: ఆసియా పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు శుభారంభం చేసింది. ఆతిథ్య దక్షిణ కొరియాతో జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 76–13 పాయింట్ల తేడాతో... చైనీస్ తైపీ జట్టుతో జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 53–19తో నెగ్గింది.

కౌంట్‌డౌన్ మొదలు...

100 రోజుల్లో వన్డే ప్రపంచకప్



బాబర్ ఆజమ్, రోహిత్ శర్మ (ఫైల్)
నరేంద్ర మోదీ స్టేడియం

- పూర్తి షెడ్యూల్ విడుదల చేసిన ఐసీసీ
- అక్టోబర్ 5న తొలి పోరు
- అక్టోబర్ 15న భారత్, పాక్ మ్యాచ్
- నవంబర్ 19న ఫైనల్
- కీలక మ్యాచ్‌లన్నీ అహ్మదాబాద్‌లోనే

ఈ శీతాకాలం మునుపటిలా చల్లగా ఉండదు. వన్డే ప్రపంచకప్‌తో హీటెక్కనుంది. ఫోర్లు, సిక్సర్లతో క్రికెట్ మజాను పంచనుంది. భారీ స్కోర్లతో, వీర విహారాలతో సాగిపోనుంది. బంతి, బ్యాట్ పైచేయి తేల్చుకునేందుకు సమాయత్తమైంది. బోరుకొట్టే మ్యాచ్‌లు కాకుండా... హోరెత్తించే షోలతో ఈ మెగా ఈవెంట్ మురిపించేందుకు సిద్ధమైంది. సెంచరీలు కొట్టే బ్యాటర్లు, హ్యాట్రిక్స్ వికెట్లు తీసే బౌలర్లు... ప్రపంచకప్ కలను సాకారం చేసుకునేందుకు తాజా దిగ్గజాలు సై అంటే సై అంటున్నారు.

ముంబై: వన్డే ప్రపంచకప్ అంకానికి అధికారిక షెడ్యూల్ విడుదలైంది. 12 ఏళ్ల తర్వాత భారత్ ఈ మెగా ఈవెంట్‌కు ఆతిథ్యమిస్తోంది. ఈసారి మాత్రం ఒంటరిగా నిర్వహించనుండటం ఈ కప్‌కున్న మరో ప్రత్యేకత. అందుకేనేమో అన్ని అనుకూల, ప్రతికూల అంశాలను పరిశీలించి.... అంతా కసరత్తు చేశాకే ఆలస్యంగా కేవలం వంద రోజుల ముందే షెడ్యూల్ విడుదల చేశారు. గతంలో ఓ ఏడాది ముందే ఐసీసీ ప్రపంచకప్ షెడ్యూల్‌ను ఖరారు చేసేది. వాన ముప్పున్న వేదికల్లో సెమీఫైనల్ మ్యాచ్‌లను కేటాయించలేదు. అక్టోబర్, నవంబర్ నెలల్లో జరిగే ఈ మెగా ఈవెంట్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మంగళవారం ముంబైలో విడుదల చేసింది. అక్టోబర్ 5న తెరలేచే ఈ ప్రతిష్టాత్మక టోర్నీకి నవంబర్ 19న జరిగే టైటిల్ పోరుతో తెర పడనుంది.

హైదరాబాద్‌లో భారత్ మ్యాచ్ లేదు

భారత్‌లోని 10 వేదికల్లో ప్రపంచకప్ మ్యాచ్‌లు ప్రత్యక్షంగా చూడొచ్చు. ఇందులో హైదరాబాద్‌కూ ఆతిథ్య భాగ్యం దక్కింది. కానీ భారత్ ఆడే మ్యాచ్‌కు నోచుకోలేకపోయింది. పాకిస్తాన్ ఆడే రెండు మ్యాచ్‌లతో పాటు న్యూజిలాండ్ ఒక మ్యాచ్ ఉప్పల్ మైదానంలో జరుగుతాయి. ఈ రెండింటికి ప్రత్యర్థులు ఖరారు కాలేదు. ప్రస్తుతం జింబాబ్వేలో జరుగుతున్న క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా రెండు జట్లు ఖరారవుతాయి. ముంబై, పుణే, ఢిల్లీ, చెన్నై, అహ్మదాబాద్, ధర్మశాల, లక్నో, కోల్‌కతా, బెంగళూరు ఈ 9 వేదికల్లో ఐదేసి చొప్పున మ్యాచ్‌లు నిర్వహిస్తారు.ఈ మెగా టోర్నీకి సన్నాహాల్లో భాగంగా భారత జట్టు రెండు వామప్ మ్యాచ్‌లు ఆడనుంది. సెప్టెంబర్ 30న గువాహటిలో ఇంగ్లండ్ జట్టుతో... అక్టోబర్ 3న త్రివేండ్రంలో క్వాలిఫయర్–1 జట్టుతో టీమిండియా తలపడుతుంది.



గత ఫార్మాటే

ఈ మెగా ఈవెంట్ కూడా గత ప్రపంచకప్ (2019) ఫార్మాట్‌లాగే రౌండ్ రాబిన్, నాకౌట్ పద్ధతిలో జరుగుతుంది. అంటే పది జట్లు ప్రతీ ప్రత్యర్థితోనూ లీగ్ దశలో తలపడుతుంది. పాయింట్ల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో ఉన్న జట్లు సెమీఫైనల్స్‌కు (నాకౌట్) అర్హత సాధిస్తాయి. తొలి సెమీఫైనల్‌కు నవంబర్ 15న ముంబై... రెండో సెమీఫైనల్‌కు నవంబర్ 16న కోల్‌కతా వేదిక కానున్నాయి. భారత్ గనుక సెమీఫైనల్ చేరితే ముంబైలో ఆ మ్యాచ్ ఆడాల్సి ఉంటుంది. ఒకవేళ సెమీఫైనల్లో భారత్‌కు పాకిస్తాన్ ఎదురైతే ఈ సెమీఫైనల్ కోల్‌కతాలో జరుగుతుంది. నాకౌట్ మ్యాచ్‌లకే (సెమీఫైనల్స్, ఫైనల్) రిజర్వ్ డేలున్నాయి.

ఆరు 'డే' మ్యాచ్‌లు... మిగతావి డే–నైట్...

ఈ టోర్నీలో మొత్తం జరిగే మ్యాచ్‌లు 48. లీగ్ దశలో 45 పోటీలు జరుగుతాయి. ఇందులో కేవలం ఆరు లీగ్‌లే డే మ్యాచ్‌లుగా ఉదయం గం. 10:30 గంటలకు మొదలవుతాయి. మిగతావన్నీ డే–నైట్ మ్యాచ్‌లుగా నిర్వహిస్తారు. వీటితో పాటు నాకౌట్ మ్యాచ్‌లు కూడా డేనైట్ వన్డేలే! డే–నైట్ మ్యాచ్‌లు మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతాయి.

దాయాదులు దంచుకునేది...

మాంచి క్రికెట్ కిక్ ఇచ్చే... అందరూ ఊపిరిబిగబట్టి చూసే మ్యాచ్ భారత్, పాకిస్తాన్ పోరు! చిరకాల ప్రత్యర్థుల మధ్య అక్టోబర్ 15న అహ్మదాబాద్‌లో లీగ్ మ్యాచ్ జరుగుతుంది. ఇదే కాదు... ఫైనల్ (నవంబర్ 19) సహా 2019 టోర్నీ ఫైనలిస్టులు ఇంగ్లండ్, న్యూజిలాండ్‌ల మధ్య టోర్నీ ఆరంభ పోరు (అక్టోబర్ 5న), ఇంగ్లండ్, ఆస్ట్రేలియా (నవంబర్ 4) తలపడే మేటి మ్యాచ్‌లను లక్ష పైచిలుకు ప్రేక్షకులు చూసే నరేంద్ర మోదీ స్టేడియంలోనే ఏర్పాటు చేశారు. గత మూడు ప్రపంచకప్‌లలో (2011లో భారత్; 2015లో ఆస్ట్రేలియా; 2019లో ఇంగ్లండ్) ఆతిథ్య జట్టు విజేతగా నిలవడం విశేషం.

నాలుగోసారి పూర్తిగా ఇండియాలోనే....

భారత్ ఆతిథ్యమివ్వబోయే నాలుగో వన్డే ప్రపంచకప్ ఇది. ఈసారి పూర్తిగా భారత్‌లోనే జరుగనుండటం ఈ వరల్డ్‌కప్ ప్రత్యేకత! తొలిసారిగా 1987లో పాక్‌తో కలిసి, రెండోసారి 1996లో పాక్, లంకలతో ఉమ్మడిగా, మూడోసారి 2011లో లంక, బంగ్లాదేశ్‌లతో సంయుక్తంగా భారత్ ఈ మెగా ఈవెంట్‌కు ఆతిథ్యమిచ్చింది. ఇప్పటి వరకు 12 సార్లు వన్డే ప్రపంచకప్ జరగ్గా... రెండోసారి మాత్రమే ఆతిథ్య జట్టు టోర్నీ తొలి మ్యాచ్‌లో బరిలోకి దిగడంలేదు. 1996లో భారత్ ఆతిథ్యమిచ్చిన ప్రపంచకప్‌లో ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య తొలి మ్యాచ్ జరగ్గా... 2023లోనూ ఈ రెండు జట్ల మధ్యే తొలి మ్యాచ్ జరగనుండటం విశేషం.

ఇదీ షెడ్యూల్

అక్టోబర్ 5: ఇంగ్లండ్ x న్యూజిలాండ్	అహ్మదాబాద్
అక్టోబర్ 6: పాకిస్తాన్ x క్వాలిఫయర్-1	హైదరాబాద్
అక్టోబర్ 7: దక్షిణాఫ్రికా x క్వాలిఫయర్-2	ఢిల్లీ
అక్టోబర్ 7: బంగ్లాదేశ్ x అఫ్గానిస్తాన్	ధర్మశాల
అక్టోబర్ 8: భారత్ x ఆస్ట్రేలియా	చెన్నై
అక్టోబర్ 9: న్యూజిలాండ్ x క్వాలిఫయర్-1	హైదరాబాద్
అక్టోబర్ 10: ఇంగ్లండ్ x బంగ్లాదేశ్	ధర్మశాల
అక్టోబర్ 11: భారత్ x అఫ్గానిస్తాన్	ఢిల్లీ
అక్టోబర్ 12: పాకిస్తాన్ x క్వాలిఫయర్-2	హైదరాబాద్
అక్టోబర్ 13: ఆస్ట్రేలియా x దక్షిణాఫ్రికా	లక్నో
అక్టోబర్ 14: ఇంగ్లండ్ x అఫ్గానిస్తాన్	ఢిల్లీ
అక్టోబర్ 14: న్యూజిలాండ్ x బంగ్లాదేశ్	చెన్నై
అక్టోబర్ 15: భారత్ x పాకిస్తాన్	అహ్మదాబాద్
అక్టోబర్ 16: ఆస్ట్రేలియా x క్వాలిఫయర్-2	లక్నో
అక్టోబర్ 17: దక్షిణాఫ్రికా x క్వాలిఫయర్-1	ధర్మశాల
అక్టోబర్ 18: న్యూజిలాండ్ x అఫ్గానిస్తాన్	చెన్నై
అక్టోబర్ 19: భారత్ x బంగ్లాదేశ్	పుణే
అక్టోబర్ 20: ఆస్ట్రేలియా x పాకిస్తాన్	బెంగళూరు
అక్టోబర్ 21: ఇంగ్లండ్ x దక్షిణాఫ్రికా	ముంబై
అక్టోబర్ 21: క్వాలిఫయర్-1 x క్వాలిఫయర్-2	లక్నో
అక్టోబర్ 22: భారత్ x న్యూజిలాండ్	ధర్మశాల
అక్టోబర్ 23:పాకిస్తాన్ x అఫ్గానిస్తాన్	చెన్నై
అక్టోబర్ 24: దక్షిణాఫ్రికా x బంగ్లాదేశ్	ముంబై
అక్టోబర్ 25: ఆస్ట్రేలియా x క్వాలిఫయర్-1	ఢిల్లీ
అక్టోబర్ 26: ఇంగ్లండ్ x క్వాలిఫయర్ 2	బెంగళూరు
అక్టోబర్ 27: పాకిస్తాన్ x దక్షిణాఫ్రికా	చెన్నై
అక్టోబర్ 28: క్వాలిఫయర్-1 x బంగ్లాదేశ్	కోల్‌కతా
అక్టోబర్ 28: ఆస్ట్రేలియా x న్యూజిలాండ్	ధర్మశాల
అక్టోబర్ 29: భారత్ x ఇంగ్లండ్	లక్నో
అక్టోబర్ 30: అఫ్గానిస్తాన్ x క్వాలిఫయర్-2	పుణే
అక్టోబర్ 31: పాకిస్తాన్ x బంగ్లాదేశ్	కోల్‌కతా
నవంబర్ 1: న్యూజిలాండ్ x దక్షిణాఫ్రికా	పుణే
నవంబర్ 2: భారత్ x క్వాలిఫయర్-2	ముంబై
నవంబర్ 3: క్వాలిఫయర్-1 x అఫ్గానిస్తాన్	లక్నో
నవంబర్ 4: ఇంగ్లండ్ x ఆస్ట్రేలియా	అహ్మదాబాద్
నవంబర్ 4: న్యూజిలాండ్ x పాకిస్తాన్	బెంగళూరు
నవంబర్ 5: భారత్ x దక్షిణాఫ్రికా	కోల్‌కతా
నవంబర్ 6: బంగ్లాదేశ్ x క్వాలిఫయర్-2	ఢిల్లీ
నవంబర్ 7: ఆస్ట్రేలియా x అఫ్గానిస్తాన్	ముంబై
నవంబర్ 8: ఇంగ్లండ్ x క్వాలిఫయర్-1	పుణే
నవంబర్ 9: న్యూజిలాండ్ x క్వాలిఫయర్-2	బెంగళూరు
నవంబర్ 10: దక్షిణాఫ్రికా x అఫ్గానిస్తాన్	అహ్మదాబాద్
నవంబర్ 11: భారత్ x క్వాలిఫయర్-1	బెంగళూరు
నవంబర్ 12: ఇంగ్లండ్ x పాకిస్తాన్	కోల్‌కతా
నవంబర్ 12: ఆస్ట్రేలియా x బంగ్లాదేశ్	పుణే
నవంబర్ 15: తొలి సెమీఫైనల్	ముంబై
నవంబర్ 16: రెండో సెమీఫైనల్	కోల్‌కతా
నవంబర్ 19: ఫైనల్	అహ్మదాబాద్

జట్లు: భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, అఫ్గానిస్తాన్, క్వాలిఫయర్-1, క్వాలిఫయర్-2 (ఈ రెండు జట్లు ప్రస్తుతం జింబాబ్వేలో జరుగుతున్న క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా ఖరారవుతాయి)

సినిమా



విహార యాత్రలో...

'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా తెరకెక్కించడం, ఆ తర్వాత మూవీ ప్రమోషన్, ఆ తర్వాత ఆస్కార్ అవార్డుకి సంబంధించిన ప్రమోషనల్ ఈవెంట్స్‌తో దర్శకుడు రాజమౌళి మూడు నెలల క్రితం వరకూ ఫుల్ బిజీగా గడిపారు. నెక్ట్స్ మహేశ్ బాబు హీరోగా భారీ సినిమాకి దర్శకత్వం వహించనున్నారు రాజమౌళి. ఈ చిత్రానికి విజయేంద్ర ప్రసాద్ కథ సమకూరుస్తున్నారు. ఇంకా కథ పూర్తి కాలేదు. ఈలోపు ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి ప్లాన్ చేసుకుంటూనే కుటుంబంతో కలిసి విహార యాత్ర ప్లాన్ చేసుకున్నారు రాజమౌళి. తమిళనాడులో గల తూత్తుక్కుడిలో కుటుంబంతో కలిసి వెకేషన్‌ని ఎంజాయ్ చేస్తున్నారాయన. భార్య రమ, కొడుకు కార్తికేయ, కోడలు పూజా, కుమార్తె మయూఖతో కలిసి హాలిడే బ్రేక్‌లో ఉన్నారు రాజమౌళి. తూత్తుక్కుడిలోని ఆక్వా అవుట్ బ్యాక్ రిసార్ట్‌లో ఈ ఫ్యామిలీ బస చేసింది. అక్కడికి వెళ్లిన గుర్తుగా మొక్కలు నాటారు రాజమౌళి. ఈ విహార యాత్రకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి.

నమ్మకంగా ఉన్నాం - నాగశౌర్య


● నాగశౌర్య, యుక్తి తరేజ, పవన్ బాసంశెట్టి

''రంగబలి' చిత్రకథని పవన్ చెప్పినట్లుగానే తీశాడు. ఈ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఈ సినిమాతో అందరూ కనెక్ట్ అవుతారు. విజయంపై చాలా నమ్మకంగా ఉన్నాం'' అని హీరో నాగశౌర్య అన్నారు. నూతన దర్శకుడు పవన్ బాసంశెట్టి తెరకెక్కించిన చిత్రం 'రంగబలి'. నాగశౌర్య, యుక్తి తరేజ జంటగా సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా జూలై 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ను హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో పవన్ బాసంశెట్టి మాట్లాడుతూ– ''పూర్తి స్థాయి వినోదం నేపథ్యంలో రూపొందిన చిత్రం 'రంగబలి'' అన్నారు.

నిఖిల్‌ని చూసి గర్వపడుతున్నా - నాగచైతన్య

''స్పై థ్రిల్లర్ సినిమాలు తీయడం అంత సులభం కాదు.. అది ఒక సవాల్. ఎందుకంటే ఇలాంటి హాలీవుడ్ సినిమాలను ఓటీటీల్లో చూసేస్తున్నారు. కానీ, 'స్పై' టీజర్, ట్రైలర్ చూశాక చాలా బాగా అనిపించింది. అంతర్జాతీయ స్థాయి విలువలకు ఏ మాత్రం తగ్గలేదు. రాజశేఖర్, చరణ్ తేజ్‌ల ప్యాషన్ ఏంటో తెలుస్తోంది. ఈ సినిమా ఘన విజయం సాధించాలి'' అని హీరో నాగచైతన్య అన్నారు. నిఖిల్ సిద్ధార్థ్, ఐశ్వర్యామీనన్ జంటగా గ్యారీ బీహెచ్ దర్శకత్వం వహించిన చిత్రం 'స్పై'. ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై కె.రాజశేఖర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా రేపు(గురువారం) విడుదలకానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన నాగచైతన్య మాట్లాడుతూ– ''నిఖిల్ అంటే నాకు చాలా ఇష్టం. 'హ్యాపీడేస్' తో కెరీర్ మొదలుపెట్టి, 'స్వామిరారా, కార్తికేయ' తో ఓ ట్రెండ్ సెట్ చేసి, 'కార్తికేయ 2' తో బాక్సాఫీస్‌ని షేక్ చేశాడు.. తనని చూసి నేను చాలా గర్వపడుతున్నాను. 'కార్తికేయ 2' తో ఒక ట్రెండ్ ఎలా సెట్ చేశాడో.. 'స్పై' చిత్రంతో ఆ ట్రెండ్ దాటి తర్వాతి స్థాయికి వెళతాడనే నమ్మకం ఉంది'' అన్నారు.

నిఖిల్ సిద్ధార్థ్ మాట్లాడుతూ–''సుభాష్ చంద్రబోస్ వంటి ఒక గొప్ప వ్యక్తి గురించి ఉన్న సినిమా 'స్పై'. నాలుగురోజుల కిందట ఈ మూవీ ఫైనల్ కాపీ చూశాక 'థ్యాంక్యూ గ్యారీ' అన్నాను.. అంత బాగా ఈ మూవీ తీశాడు. ఇలాంటి సినిమా చేసినందుకు యూనిట్ అంతా గర్వపడుతున్నాం. ప్రతి భారతీయుడు చూడాల్సిన సినిమా ఇది'' అన్నారు. ''ఒక్క ఫోన్ కాల్‌తో 'స్పై' ప్రీ రిలీజ్ వేడుకకి వచ్చిన నాగచైతన్యగారికి థ్యాంక్స్'' అన్నారు కె.రాజశేఖర్ రెడ్డి.


● నిఖిల్, రాజశేఖర్ రెడ్డి, నాగచైతన్య, ఐశ్వర్యామీనన్

గ్యారీ బీహెచ్ మాట్లాడుతూ–''డాక్టర్ అయిన నేను సినిమా ఇండస్ట్రీకి వెళ్తానంటే ఎవరూ ఒప్పుకోరు. కానీ, నా తల్లితండ్రులు ఒప్పుకుని, నన్ను ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు. 'స్పై' చాలా బాగా తీశావంటూ నిఖిల్‌గారు నన్ను హత్తుకోవడంతో సినిమా విజయంపై మరింత నమ్మకం పెరిగింది'' అన్నారు. ఈ వేడుకలో ఈడీ ఎంటర్‌టైన్ మెంట్స్ సీఈఓ చరణ్ తేజ్, సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల, కెమెరామేన్ వంశీ పచ్చిపులుసు, యూవీ క్రియేషన్స్ నిర్మాత వంశీ, నటీనటులు సాన్య ఠాకూర్, ఆర్యన్ రాజేష్ పాల్గొన్నారు.

ఆగస్టులో ఆరంభం


● నీరజ


● సిద్ధు

దాదాపు దశాబ్ద కాలంగా ఇండస్ట్రీలో కాస్ట్యూమ్ డిజైనర్‌గా రాణిస్తున్నారు నీరజ కోన. ఎన్టీఆర్, రామ్‌చరణ్, సూర్య వంటి టాప్ స్టార్స్ చేసిన సినిమాలకు నీరజ కోన కాస్ట్యూమ్ డిజైనర్‌గా చేశారు. సమంత, రకుల్ ప్రీత్‌సింగ్ వంటివారికి కూడా కాస్ట్యూమ్స్ డిజైన్ చేశారు. తాజాగా నీరజ కోన దర్శకురాలిగా మెగా ఫోన్ పట్టనున్నారని సమాచారం. రొమాంటిక్ థ్రిల్లింగ్ లవ్‌స్టోరీగా రూపొందనున్న ఈ సినిమాలో 'డీజే టిల్లు' ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తారని తెలిసింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఆగస్టు లేదా నవంబరులో ప్రారంభం కానుందట. ఈ సినిమాకు ప్రముఖ ఛాయాగ్రాహకులు పీసీ శ్రీరామ్, మ్యూజిక్ డైరెక్టర్ తమన్, రైటర్ మిథున్ చైతన్యను ఎంపిక చేసినట్లు సమాచారం.

యాక్టర్ అనిపించుకోవడం కష్టం - శ్రీ విష్ణు



''స్టార్ అవ్వడం అనేది మన చేతుల్లో లేదు. అయితే ఎంచుకునే పాత్రలతో మంచి యాక్టర్ అవ్వడం అనేది మన చేతుల్లోనే ఉంటుంది. కానీ యాక్టర్ అనిపించుకోవడం అనేది చాలా కష్టం. 'స్టార్' లేదా 'యాక్టర్' అని ఎవరైనా నాకు ఆప్షన్ ఇస్తే.. యాక్టర్ అవుతాననే చాలెంజ్‌నే తీసుకుంటాను'' అని శ్రీ విష్ణు అన్నారు. శ్రీ విష్ణు హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సామజ వరగమన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శ్రీ విష్ణు చెప్పిన విశేషాలు..

● 'సామజ వరగమన'లో బాలసుబ్రహ్మణ్యం అనే యువకుడి పాత్రలో నటించాను. థియేటర్ బాక్సాఫీస్‌లో ఉద్యోగం చేస్తుంటాడు బాలసుబ్రహ్మణ్యం. సో.. కొంతమంది హీరోల డైలాగ్స్ ఈ సినిమాలో ఉంటాయి. నవ్వించడమే పనిగా పెట్టుకుని మేం తీసిన సినిమా ఇది.యూత్‌కు, ఫ్యామిలీ ఆడియన్స్‌కు ఈ సినిమా బాగా నచ్చుతుంది. సినిమాలో ఓ సర్‌ప్రైజింగ్ పాయింట్ కూడా ఉంది. తెలుగు సినిమాల్లో ఇప్పటివరకూ ఇలాంటి పాయింట్ రాలేదనే అనుకుంటున్నాం. ● ఇండస్ట్రీలో పెద్ద స్టార్స్ ఎక్కువైపోయారు. పెద్ద దర్శకులు తక్కువైపోయారు. కొన్ని సార్లు స్టార్ డైరెక్టర్స్‌కే స్టార్ హీరోలు దొరకడం లేదు కూడా. ఇక స్టార్ దర్శకులు మాలాంటి వారితో సినిమాలు చేయాలంటే అది టఫ్ అవుతుంది. దీనికి తోడు మార్కెట్ సమీకరణాలు కూడా ఉంటాయి. అలాగే పెద్ద దర్శకులు కొంతమంది దాదాపు రెండేళ్ల వరకూ సినిమాలను ప్లాన్ చేసుకుంటున్నారు. నేను సమయం వృథా కాకూడదని కొత్త దర్శకులతో, వీలైతే నేను ఇంట్రడ్యూస్ చేసిన వారితోనే మళ్లీ సినిమాలు చేసుకునేలా ప్లాన్ చేసుకుంటాను. ● విలన్ రోల్స్ చేయడం నాకు ఇష్టమే. అయితే 'వీరభోగ వసంతరాయలు', 'తిప్పరా మీసం' సినిమాల్లో నెగటివ్ టచ్ ఉండే రోల్స్ చేస్తే ప్రేక్షకులు అంతగా యాక్సెప్ట్ చేయలేదనిపించింది. అందుకే విలన్ రోల్స్ చేయాలనుకోవడం లేదు. ● ప్రస్తుతం హర్ష కొనుగంటి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్‌లో ఓ సినిమా చేస్తున్నాను. అలాగే 'రాజరాజ చోర'కు ప్రీక్వెల్‌గా హసిత్ గోలి దర్శకత్వంలోనే ఓ సినిమా చేస్తున్నాను.

కథే హీరో - డీవై చౌదరి



రోహిత్ బెహల్, అపర్ణా జనార్దనన్ జంటగా నటించిన చిత్రం 'లవ్ యూ రామ్'. డీవై చౌదరి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా కథ అందించిన దర్శకుడు కె. దశరథ్ మరో నిర్మాత. ఈ సినిమా ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో డీవై చౌదరి మాట్లాడుతూ – ''దశరథ్, నేను గతంలో '16 డేస్' అనే సినిమా చేశాం. అయితే ఇటీవల కుటుంబం అంతా కలిసి చూడదగ్గ సినిమాలు రావడం తగ్గింది. దీంతో ఓ క్లీన్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకులకు అందించాలని 'లవ్ యూ రామ్' తీశాం. ఇది డిఫరెంట్ లవ్‌స్టోరీ. కథే హీరో. అందుకే కొత్తవారిని తీసుకున్నాం. కథ విషయానికొస్తే.. ప్రేమించడమే జీవితం అని నమ్మే అమ్మాయి, నమ్మించడమే జీవితం అనుకునే అబ్బాయి మధ్య నెలకొన్న సంఘర్షణే ఈ చిత్రం. నేను, దశరథ్ మూడు వెబ్ సిరీస్‌లకు కథలు రెడీ చేశాం. త్వరలో దశరథ్ నుంచి ఓ పెద్ద ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రకటన వస్తుంది'' అన్నారు.

నారాయణతో సుధాకర్‌కి బ్రేక్ వస్తుంది - డైరెక్టర్ అనిల్ రావిపూడి

''నారాయణ అండ్ కో' ట్రైలర్ అద్భుతంగా ఉంది. సుధాకర్ నా స్నేహితుడు. తనతో నాది లాంగ్ జర్నీ. తనకి 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' చిత్రంతో చక్కని టేకాఫ్ వచ్చింది. 'నారాయణ అండ్ కో'తో మంచి బ్రేక్ వస్తుందనుకుంటున్నాను'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి అన్నారు. సుధాకర్ కోమాకుల హీరోగా చిన్నా


● అనిల్, సుధాకర్, విజయ్

పాపిశెట్టి దర్శకత్వం వహించిన చిత్రం 'నారాయణ అండ్ కో'. పాపిశెట్టి బ్రదర్స్‌తో కలిసి సుధాకర్ కోమాకుల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకు దర్శకులు అనిల్ రావిపూడి, విజయ్ కనకమేడల, హీరో తిరువీర్, నిర్మాత రాజ్ కందుకూరి, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ అతిథులుగా హాజరై, 'నారాయణ అండ్ కో' విజయం సాధించాలి అన్నారు. సుధాకర్ కోమాకుల మాట్లాడుతూ– ''నారాయణ అండ్ కో' సకుటుంబ సపరివార సమేతంగా చూడదగ్గ సినిమా'' అన్నారు. ''ఇది ఫ్యామిలీ ఫండింగ్ మూవీ. చాలామంది సపోర్ట్‌తో ఈ సినిమా చేశాం'' అన్నారు దర్శక–నిర్మాత చిన్నా పాపిశెట్టి.

యాక్షన్ థ్రిల్లర్

జగన్‌మోహన్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఎస్–99'. శ్వేతా వర్మ హీరోయిన్‌గా యతీష్, నందిని నిర్మిస్తున్న ఈ సినిమా మోషన్ టైటిల్‌ను నిర్మాత రమేష్‌ప్రసాద్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''మా నాన్నగారు (ప్రముఖ దర్శక–నిర్మాత ఎల్వీ ప్రసాద్) సినిమాల కోసం చాలా కష్టపడ్డారు.. ఆ కష్టమే నన్ను ఉత్సాహపరిచి, ఇండస్ట్రీవైపు వచ్చేలా చేసింది. మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన నేను ప్రపంచవ్యాప్తంగా ప్రసాద్ ల్యాబ్స్‌ను నెలకొల్పడం హ్యాపీగా ఉంది.


● యతీష్, రమేష్‌ప్రసాద్, జగన్‌మోహన్

ప్రస్తుతం సినిమాలు సరిగ్గా ఆడటం లేదు.. కానీ చాలామంది కష్టపడి సినిమాలు చేస్తున్నారు. 'ఎస్–99' టైటిల్ కొత్తగా ఉంది. ఈ మూవీ సక్సెస్ అవ్వాలి'' అన్నారు. ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది'' అన్నారు జగన్ మోహన్. ''ఎస్–99' లాంటి చిత్రాలు మరిన్ని తీయడానికి రెడీగా ఉన్నాం'' అన్నారు యతీష్.